ప్రజాశక్తి

మంగళవారం 15 ఆగస్టు 2023

8 పేజీలు



విశాఖపట్నం




అనకాపల్లి

రూ.600 కోట్లతో కెజిహెచ్ అభివృద్ధి

మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాలకు వెన్నెముకగా నిలిచిన కెజిహెచ్‌ను నాడు - నేడు పథకం కింద రూ.600 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని తెలిపారు. సోమవారం సాయంత్రం రూ.30 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన కెజిహెచ్ ఆంధ్ర మెడికల్ కాలేజీ సెంచనరీ ఆర్చిని, అలాగే రూ.30 లక్షలతో మిగతా 2లో..



అభివృద్ధి పనుల శిలాఫలకం వద్ద మంత్రి రజని తదితరులు




సుందరంగా పోలీస్ బ్యారెక్స్ ప్రాంగణం

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

వార్త 2లో..

నాడు విజన్ 2020.. నేడు విజన్ 2047

- నేడు విశాఖకు చంద్రబాబు రాక
- ప్రత్యేక డాక్యుమెంటు విడుదల
- రాజకీయేతర కార్యక్రమమంటూ టిడిపి నేతల ప్రచారం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

టిడిపి జాతీయ అధ్యక్షులు ఎన్.చంద్రబాబునాయుడు మంగళవారం సాయంత్రం విశాఖ సాగర తీరంలో విజన్ - 2047 డాక్యుమెంటును విడుదల చేసేందుకు విచ్చేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం ఆయన ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విజన్ -2020ని విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా 2047 నాటికి అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి టెక్నాలజీ, పర్యావరణపరంగా చాలా అభివృద్ధి జరుగుతుందంటూ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించేందుకు ఆయన విశాఖకు వస్తున్నారు. ఇది నాన్ పొలిటికల్ ప్రోగ్రామ్ అని, దేశ అభివృద్ధికి సంబంధించినదని, తెలుగు వారి ప్రతిభను గుర్తించే కార్యక్రమమని టిడిపి నేతలు సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వంపై విమర్శలూ చేశారు. హైదరాబాద్‌లో చంద్రబాబు అభివృద్ధి చేసిన ప్రాంతంలో ఎకరం కోట్లాది రూపాయలు ధర పలుకుతుందంటూ చెప్పారు. వైసిపి ప్రభుత్వానికి విధ్వంసం తప్ప మరో విధానం లేదంటూ ఎద్దేవా చేశారు.

జిఎఫ్ఎస్‌టి సంస్థకు బాబు ఛైర్మన్

గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్సఫర్మేషన్ (జిఎఫ్ఎస్‌టి) అనే సంస్థకు చంద్రబాబు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సంస్థ కొన్ని నెలలుగా విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై కృషిచేస్తోంది. ప్రధానంగా 5 వ్యూహాలు దీనిలో ఉన్నాయి. భారత్ గ్లోబల్ లీడర్‌గా అభివృద్ధి కావడానికి దీంట్లో ప్రాధాన్యతా అంశాలుగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఇండియా విజన్ -2047 డాక్యుమెంట్‌ను చంద్రబాబు విశాఖ బీచ్‌రోడ్డులోగల ఎంజిఎం పార్కులో సోమవారం జరిగే కార్యక్రమంలో ఆవిష్కరించ నున్నారు. ఈ కార్యక్రమంలో మేధావులు, విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఉన్నత విద్యావంతులు, మిగతా 2లో..



వైసిపికి భూములపైనే ప్రేమ

వార్త మెయిన్‌లో..



స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ఎవరిచ్చారు ?

ప్రజాశక్తి - ఉక్కునగరం

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను, జాతి సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మే హక్కు కేంద్రంలోని మోడీ సర్కారుకు ఎవరిచ్చారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరాం ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 914వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు విషయంలో ఒంటెద్దు పోకడ వీడకుంటే తగిన మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి..

రూ.600 కోట్లతో కెజిహెచ్ అభివృద్ధి

కెజిహెచ్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 14 బెడ్స్ క్యాజువాలిటీని, నర్సింగ్ కాలేజీ కోసం గ్లాండ్ ఫార్మా సంస్థ రూ.29 లక్షలతో సమకూర్చిన 51 సీటింగ్ కెపాసిటీ కలిగిన బస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు - నేడు కింద 600 కోట్లతో చేపట్టిన పనుల్లో భాగంగా రూ.73 కోట్లతో పీజీ బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టల్ భవన నిర్మాణం అందుబాటులోకి వస్తుందన్నారు. రూ.79 కోట్లతో కెజిహెచ్‌కు అవసరమైన వివిధ వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. రూ.12 కోట్లతో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రూ.4 కోట్లతో సిటి స్కాన్, రూ.46 కోట్లతో అంకాలజీ విభాగంలో ఎక్యూప్‌మెంటును ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటన్నింటితో కెజిహెచ్‌లో నాణ్యమైన వైద్య సేవలు పేదలకు అందుతాయన్నారు. కార్పొరేట్ వైద్య సేవలు అందించడమే తన ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషితో రూపుదిద్దుకుంటున్నాయని, వీటిలో నాలుగు మెడికల్ కాలేజీలు ఉత్తరాంధ్ర జిల్లాలోనే రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాడు విజన్ 2020.. నేడు విజన్ 2047

పలు రంగాల నిపుణులు పాల్గొననున్నారని తెలుస్తోంది.

ఈ విజన్ డాక్యుమెంటుపై జిఎఫ్ఎస్‌టి అన్ని వర్గాల సూచనలను స్వీకరించనుంది. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే ఈ సంస్థ నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక రంగ నిపుణులు, పర్యావరణ వేత్తలు, రిటైర్డ్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులు, కార్పొరేట్ ప్రముఖులు, విద్య, వైద్య, న్యాయ మీడియా రంగ నిపుణులు సభ్యులుగా ఉన్నారని తెలుస్తోంది. ఒక విధానం రూపొందించడం, రీసెర్చి, నాలెడ్జి షేరింగ్ అనే అంశాలకు జిఎఫ్ఎస్‌టి వేదికగా పనిచేయనుందని చెబుతున్నారు. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగం, లాజిస్టిక్స్, తయారీ పరిశ్రమలు, ఎంఎస్ఎంఇ పరిశ్రమలు, టెక్నాలజీ, ఎనర్జీ, స్టార్టప్ ఎకో సిస్టమ్, వాతావరణ మార్పులు, ప్రజారోగ్యం వంటి అంశాలపై జిఎఫ్ఎస్‌టి ఫోకస్ పెట్టే అవకాశాలున్నాయి. దేశం 2047 నాటికి ప్రపంచ నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశంపై తాజా డాక్యుమెంట్‌లో చర్చించినట్టు తెలుస్తోంది.

బీచ్ రోడ్డులో ర్యాలీ

కలెక్టరేట్ : చంద్రబాబు మంగళవారం విశాఖకు చేరుకున్న తర్వాత ఆర్‌కె బీచ్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహిస్తారని టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. విశాఖ ఎంపీ సత్యనారాయణ పిరికి రౌడీ షీటర్ అని, తాము అధికారంలోకి వస్తే అతని భాగోతం బయట పెడతామని అన్నారు. చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

ఎంవిపి.కాలనీ : చంద్రబాబు విజన్ - 2047 సభ కోసం సిద్ధం చేసిన ఎంజిఎం పార్కును టిడిపి నాయకులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఏర్పాట్లుపై అక్కడి వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, నాయకులు చింతకాయల విజయ్, విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, బండారు అప్పలనాయుడు, బుద్ధ నాగ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ఎవరిచ్చారు ?

గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బిజెపి విధానాలు దేశంలోని ప్రజలను, కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. దేశంలో సంపదను సృష్టించలేని బిజెపి పాలకులు స్వాతంత్ర్యం అనంతరం ఎందరో మహానుభావాలు నెలకొల్పిన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుండటం దారుణమన్నారు. నాడు రూ.4900 కోట్ల పెట్టుబడితో నెలకొల్పిన విశాఖ ఉక్కు కర్మాగారం నేడు మూడున్నర లక్షల కోట్ల విలువకు చేరిందని, 54 వేల కోట్లును ప్రభుత్వాలకు పన్నుల రూపేణా చెల్లించిన ఏకైక భారత ప్రభుత్వ రంగ సంస్థ అని వెల్లడించారు. అటువంటి పరిశ్రమను పోరాటాలతో రక్షించుకుంటామని స్పష్టం చేశారు. దీక్షల్లో డి.దేముళ్లు, జి.ఆనంద్, రమణ, ఆర్.సూరిబాబు, కెవి.రమణ, సింహాద్రి, మహమ్మద్, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారానికి 867వ రోజుకు చేరాయి. దీక్షల్లో విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) నాయకులు కెవి.రమణ అఖిల్, రమణారెడ్డి, లక్ష్మి, త్రినాథ్, సుందరరావు, కల్యాణ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీస్ బేరక్స్ గ్రౌండ్‌లో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని మంగళవారం జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆ తర్వాత జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఆహ్వానితులు, పాస్‌లు ఉన్నవారు ఉదయం 8 గంటలకల్లా సభా ప్రాంగణంలో కేటాయించిన సీట్లలో ఆశీనులు కావాలని అధికారులు సూచించారు.

ఇదిలా ఉండగా జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం, పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్, జివిఎంసి ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలలోని స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లును పరిశీలించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ ఉన్నారు.

మోడీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మోడీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే కాకుండా దేశ సంపదను స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెడుతోందని, దేశాన్ని మోడీ నుంచి కాపాడుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సాంస్కృతిక సంబరాలను మద్దిలపాలెం కళాభారతి వద్దనున్న సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి కమిటీల ఆధ్వర్యంలో చేపట్టారు. కార్మికుల పిల్లలు అభ్యుదయ పాటలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. పాటలు పాడారు. కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ఐద్వా కార్యదర్శి కె.కుమారి, అధ్యక్షులు ఎం.మౌనిక, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, పిఎన్ఎం నాయకులు చంటి, ఎన్‌వి.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమార్

వీధి దీపాల నిర్వహణ ఇలాగేనా..

అధికారులపై మేయర్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో వీధి దీపాల నిర్వహణపై అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హెచ్చరించారు. సోమవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు వేణుగోపాల్, శ్యాంసన్‌రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు లక్ష్మోజి, సహాయక ఇంజనీర్లతో వీధి దీపాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఏ వార్డులో సందర్శించిన ప్రధానంగా వీధి దీపాల నిర్వహణపైనే ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. కోట్లాది రూపాయలను వీధి దీపాల నిర్వహణ కోసం జివిఎంసి ఖర్చు చేస్తున్నా.. వీధి దీపాలు సరిగా వెలగకపోవడంపై ఆమె జివిఎంసి ఎలక్ట్రికల్ విభాగపు అధికారులపైనా, సంబంధిత కాంట్రాక్టర్‌పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాలపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. సచివాలయ పరిధిలో ఆయా ఎమినిటీ కార్యదర్శులు వీధి దీపాల నిర్వహణ బాధ్యత తీసుకుని వెలగని వీధి దీపాలను 24 గంటల్లో వెలిగేలా చూడాలని ఆదేశించారు.

పవన్ సాధించిందేమిటి ? : మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు చెప్పిన మాటలు విని విశాఖలో భూ కుంభకోణాలు వెలికితీస్తానంటూ బయలుదేరిన పవన్ కల్యాణ్ ఐదు రోజులుగా ఈ ప్రాంతంలో తిరిగినా ఏమి సాధించలేకపోయాడని, ఎందుకు తిరుగుతున్నాడో.. ఎవరి కోసం తిరుగుతున్నాడో ఆయనకే అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సంధ్యా మెరైన్స్ వైజాగ్ మారథాన్-2 రిజిస్ట్రేషన్స్ షురూ!

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 17న నిర్వహించనున్న సంధ్యా మెరైన్స్ వైజాగ్ మారథాన్ రెండవ ఎడిషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, టీజర్‌ను, సోమవారం నోవాటెల్ హోటల్ లో జివిఎంసి కమీషనర్ సిఎం సాయకాంత్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కలిగించే నడక, పరుగుపై అవగాహన కలిగించేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీ యమన్నారు. ఏకో వైజాగ్‌పై ప్రచారం చేయాలని, తానూ మారథాన్‌లో పాల్గొంటానన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ మారథాన్ విజేతలకు రూ. 5 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తున్నట్లు ప్రకటించారు. 21కె, 10కె, 5కె, 3కె నాలుగు విభాగాల్లో అన్ని వయస్సుల వారూ పాల్గొనవచ్చని, నమోదు చేసుకున్న వారికి ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఔత్సాహికులు http://www.vizagmarathon.run వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టైటిల్ స్పాన్సర్స్ సంధ్యా మెరైన్స్ డైరెక్టర్ కె.ఆనంద్, మెడికల్ పార్టనర్ అపోలో హాస్పిటల్ సిఇఒ రామచంద్ర పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

జోన్ 8 అధికారులపై అట్రాసిటీ కేసు పెట్టాలి


ప్రజాశక్తి - కలెక్టరేట్ : కుల వివక్ష పాటిస్తున్న, కులదురంహకారులకు సహకరిస్తున్న జివిఎంసి జోన్ 8 అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్య తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. 91వ వార్డు నేతాజీ నగర్ (గోపాలపట్నం)లో కాలువ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత కుటుంబం ఇంటి పక్క నుంచి కాలువ కట్టకూడదనే వివక్షతతో కాలువ నిర్మాణ పనులను కొంతమంది వ్యక్తులు అడ్డుకుంటే జివిఎంసి అధికారులు వారిపై చర్య తీసుకోకపోగా, వారిని బలపరిచే విధంగా వ్యవహరించడం కుల వివక్షతకు పాల్పడమే అవుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు వైసిపి నాయకుడు బెహరా భాస్కరరావు ఒత్తిడికి తలొగ్గి ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఆగిపోయిన కాలువ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, సిఐటియు నాయకులు చంద్రమౌళి, మత్స్యకార సంఘం నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్: జివిఎంసి 68, 69 వార్డుల మున్సిపల్ కార్మికుల వేతన బకాయి తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సీనియర్ ఉపాధ్యక్షుడు గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంబంధిత అధికారి స్పందించి ధర్నా శిబిరం వద్దకు వచ్చి, సాంకేతిక సమస్యతో జూన్ నెల వేతనం చెల్లింపులో జాప్యం జరిగిందని, సరిచేసి నెలరోజుల్లో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిఐటియు గాజువాక జోన్ కమిటీ కార్యదర్శి ఎ.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ట్రాఫిక్ పునరుద్ధరించండి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సిరిపురం జంక్షన్‌లో పాతపద్ధతిలోనే ట్రాఫిక్‌ను కొనసాగించాలని ఎంపీ ఎంవివి సత్యనారాయణ కోరారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా తన దృష్టికి వచ్చిన సమస్యను, సోమవారం సిపి త్రివిక్రమ్‌వర్మ, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మను కలిసి విన్నవించారు. సిరిపురం కూడలి టైకూన్ జంక్షన్ వద్ద 3-వే ట్రాఫిక్‌ను మూసేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని,ఇంతకుముందు ఉన్న 3-వే జంక్షన్ పాత పద్ధతిని పునరుద్ధరించాలని కోరారు.



కరెంట్ బిల్లు.. ముట్టుకుంటే షాక్

సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు
వినియోగదారుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇప్పటి వాడకం, రెండేళ్ల కిందటి వాడకం, నాలుగేళ్ల కిందటి వాడకంలో సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రభుత్వం విద్యుత్ బిల్లులు వేసి తమ నడ్డి విరుస్తోందని పలువురు వినియోగదారులు మండి పడుతున్నారు. చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో జూన్, జూలై నెలల బిల్లుల్లో పొందుపరిచిన బిల్లు మొత్తం చూసి షాక్‌కు గురైనట్లు పలువురు వాపోయారు. సర్ ఛార్జీలు, ట్రూ ఆఫ్ ఛార్జీలు, ఎఫ్ఎస్‌పి ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఇడి ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీలు అంటూ కరెంట్ బిల్లులో మోత మోగుతోంది. చెత్త పన్ను విధింపు, ఆస్తి పన్ను పెంపు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు ఛార్జీలను కూడా ప్రభుత్వం పెంచింది. మరో వైపు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచుతూ ప్రజలను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడి ప్రజలపై భారాలు మోపుతుండడంతో ప్రజలు మోయలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 30 వేల గృహ విద్యుత్ సర్వీసులు, 3 వేల పైచిలుకు వాణిజ్య సర్వీసులు, 72 చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, 600 పైబడి వీధి దీపాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వాటర్ స్కీమ్‌లు, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి.

గతంలో నామమాత్రం...

కరెంట్ బిల్లు ముట్టుకుంటే షాక్ కొట్టేలా ఉంది. తమ ఇంటి కరెంట్ బిల్లు జూన్‌లో రూ.2,200, జులైలో రూ.2,993 వచ్చింది. ట్యూబ్ లైట్, ఫ్యాన్, ఏసీ, 3 ఎల్ఇడి బల్బులు ఉన్నాయి. గతంలో నామమాత్రంగా వచ్చే కరెంట్ బిల్లు ఒక్క సారిగా పెరిగిపోయింది.



బి.రూప
ఎవిఎస్ఆర్.కాలనీ
తగరపువలస

ఛార్జీలు పెంపు దారుణం

మా ఇంటికి జూన్‌లో కరెంట్ బిల్లు రూ.4,500, జులైలో రూ.2,170 బిల్లు వచ్చాయి. 4 ట్యూబ్ లైట్లు, ఒక టేబుల్ ఫ్యాన్, 3 సీలింగ్ ఫ్యాన్లు, ఫ్రిజ్, టీవీ ఉన్నాయి. గతంలో నెలకు కరెంట్ బిల్లు రూ.1000 లోపు వచ్చేది. ఇప్పుడు ఏకంగా రెట్టింపు అయింది.



అత్తిలి గంగాభవాని
ఎవిఎస్ఆర్ కాలనీ
తగరపువలస

ఎలా చెల్లించాలి

కరెంట్ బిల్లును చూస్తే అంత మొత్తం ఎలా చెల్లించ గలమని ఆందోళన నెలకొంది. జూన్‌లో రూ.3,510, జులైలో రూ.1509 బిల్లు వచ్చింది. గతంలో రూ.700 లోపు వచ్చేది. 2019 ఏడాదికి ముందు రూ.200 వచ్చేది.



అత్తిలి భారతి
ఎవిఎస్ఆర్ కాలనీ,
తగరపువలస

శిష్టకరణ సంఘం అధ్యక్షునిగా అనిల్ కుమార్

ప్రజాశక్తి పిఎం.పాలెం : ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పిఎం.పాలెం ప్రాంతానికి చెందిన దొంకాడ అనిల్‌కుమార్ నియమితులయ్యారని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం అధ్యక్షులు ఎస్ఎస్‌కె.మహంతి, ప్రధానకార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి తెలిపారు. అల్లిపురం శిష్టకరణ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అనిల్ కుమార్ దంపతులను సత్కరించారు. రాష్ట్ర సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సమర్థవంతమైన సేవలందించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.అనుషాపట్నాయక్, అఖిల భారత శిష్ట కరణ సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు పంచాయతీల్లో 'నా దేశం నా భూమి'

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని మద్ది, వికె.పాలెం, కృష్ణాపురం, పాండ్రంగి, తునివలస, నేరెళ్లవలస, చిన్నాపురంలో సోమవారం 'నా దేశం నా భూమి' కార్యక్రమాలను ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. జాతీయ గీతాలు, మొక్కలు నాటే కార్యక్రమం, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, ఎపిఒ వరలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో గృహం కేటాయించాలంటూ వినతి

ప్రజాశక్తి -పిఎం పాలెం : టిడ్కో గృహాన్ని కేటాయించాలని కోరుతూ జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం ప్రాంతానికి చెందిన షేక్ సుభాని సోమవారం జోన్-2 కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో చేపట్టిన ఈ నిర్మాణాలకు పూర్తిచేయకుండా కాలయాపన చేస్తూ వస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పట్లో తనకు టిడ్కో ఇల్లు మంజూరు కావడంతో నగదు చెల్లించాలని జివిఎంసి నోటీసు ఇచ్చిందని తెలిపారు. బ్యాంక్ లోన్‌కు వయసు సరిపోనందున మొత్తం కట్టాలనడంతో బంగారాన్ని బ్యాంక్‌లో తనఖా పెట్టి చెల్లించానని చెప్పారు. బ్యాంక్‌లో పెట్టిన బంగారానికి నేటికి రూ.20వేలు వడ్డీ కట్టానని, ఇల్లు మాత్రం నేటికీ అప్పగించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు బక్కన్నపాలెం సౌండ్ అండ్ సౌండ్ లే-అవుట్‌లో నిర్మించిన టిడ్కో గృహాల వద్ద ఫొటో తీసుకొని ఆవేదన వెలిబుచ్చారు.

విశాఖ చేరుకున్న వైజాగ్ వారియర్స్

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) రెండో సీజన్‌లో ఆడేందుకు వైజాగ్ వారియర్స్ జట్టు విశాఖ చేరుకుందని వైజాగ్ వారియర్స్ యజమాని గేదెల శ్రీనుబాబు తెలిపారు. పిఎం.పాలెం క్రికెట్ స్టేడియంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ, వైజాగ్ వారియర్స్ హోమ్ గ్రౌండ్‌గా డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిలుస్తుందన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ఆటగాడు అశ్విన్ హెబ్బార్ 2022లోని ప్రారంభ సీజన్‌లోను, రెండో సీజన్‌లోనూ కెప్టెన్‌గా కొనసాగుతున్నారని తెలిపారు. స్థానిక ప్రతిభను వెలికితీసి ఐపిఎల్, అంతర్జాతీయ క్రికెట్ జట్లకు ఆటగాళ్లను అందించడమే వైజాగ్ వారియర్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సిఇఒ భరణి మాట్లాడుతూ, ఆరు టీమ్‌లు ప్రస్తుత లీగ్‌లో ఆడుతున్నాయని తెలిపారు.

స్పందనకు 3 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన స్పందనలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు పలు సమస్యలపై 3 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ఒక అర్జీ ఇచ్చారు. ఆయా అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించినట్లు జోనల్ కమిషనర్ రాము తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : హిందీ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు సర్టిఫికెట్లు అందజేశారు.

పేద కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక పేద కుటుంబానికి చిట్టివలస తెలగ సేవా సంఘం ఆధ్వర్యాన సోమవారం నిత్యావసరాలు అందజేశారు. ఆ కుటుంబానికి ఇంటి మరమ్మతుల నిమిత్తం రూ.31 వేలు ఆర్థిక సాయాన్ని సంఘం అధ్యక్షులు రంగూరి సీతారామదొర (రాంబాబు) అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రంగూరి రామ్‌కుమార్, శ్రీను, ఎం.శ్రీను, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యాన సోమవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపిపి దంతులూరి వెంకట శివసూర్య నారాయణరాజు (వాసు రాజు), రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు, బైబిల్ మిషన్ సేవకులు ఎంఎం.జాకబ్, ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ మోహన్‌కుమార్, రెవరెండ్లు కాంతయ్య, సంతోష్ పాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి వాసు రాజును సత్కరించారు.

లక్ష్మీపురం సర్పంచ్‌గా జగదీశ్వరరావు ఏకగ్రీవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్‌గా లచ్చుభుక్త జగదీశ్వరరావు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రాజేష్ పట్నాయక్, ఎండిఒ పి.వెంకటరమణ తెలిపారు. సర్పంచ్ స్థానానికి ఈ నెల 19న ఉప ఎన్నికల నేపథ్యంలో ఆ స్థానానికి నామినేషన్లు వేసిన లచ్చుభుక్త లక్ష్మి, బోని రమణ, కనకల సత్యనారాయణ, కరుభుక్త అప్పలరాజు, కరుభుక్త చందు సోమవారం తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో అనివార్యంగా వైసిపి బలపరిచిన లచ్చుభుక్త జగదీశ్వరరావు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మేరకు ధ్రువ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రాజేష్‌పట్నాయక్, ఎండిఒ పి.వెంకటరమణ అందజేశారు.



జగదీశ్వరరావును అభినందిస్తున్న వైసిపి ఇంఛార్జి మహేష్ తదితరులు

10వ వార్డు సభ్యునిగా పూసర్ల

టి.నగరపాలెం పంచాయతీ 10వ వార్డు సభ్యునిగా పూసర్ల రామారావు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ స్థానానికి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రాజేష్‌పట్నాయక్, ఎండిఒ పి.వెంకటరమణ ధ్రువపత్రం అందజేశారు.

పలువురి అభినందనలు

లక్ష్మీపురం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన లచ్చుభుక్త జగదీశ్వరరావును ఎండిఒ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం పలువురు అభినందించారు. జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, వైసిపి ఇంఛార్జి ముత్తంశెట్టి మహేష్, సింగనబంద సర్పంచ్ జివి.నారాయణ, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

టి.నగరపాలెం పంచాయతీ 10వ వార్డు సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పూసర్ల రామారావును టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, తాళ్ళవలస ఎంపిటిసి సభ్యులు కోరాడ రమణ, మాజీ సర్పంచ్ పొట్నూరు రాము తదితరులు అభినందించారు.

అన్నా క్యాంటీన్ తెరిపించాలి : టిడిపి

ప్రజాశక్తి -తగరపువలస : టిడిపి హయాంలో స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా ఏర్పాటుచేసిన అన్నా కేంటీన్‌ను తెరిపించాలని ఆ పార్టీ భీమిలి నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు వైసిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చిట్టి వలస జ్యూట్ మిల్లు తెరిపించాలి

మూతపడిన చిట్టివలస జ్యూట్ మిల్లును తెరిపించాలని రాజబాబు కోరారు. అధికారంలోకి వచ్చాక మిల్లు తిప్పుతామని కార్మికులకు ఇచ్చిన హామీని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిలబెట్టుకోలేదని విమర్శించారు. మిల్లు ప్రధాన గేట్ వద్ద ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా నూకరాజు, డిఎఎన్.రాజు, పాసి త్రినాధ్‌కుమార్, టి.సూరిబాబు, ఎంవి.గురుమూర్తి, డి.సిద్దార్థవర్మ, గరే సదానంద తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో బిఎల్ఒలతో కలిసి టిడిపి నాయకులు ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, గరే గురునాథ్, కొరగంజి సూరిబాబు, అబ్దుల్ భాష, బిఎల్ఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

పోర్టు పెన్షనర్లకు వైద్య తనిఖీలు

ప్రజాశక్తి- మాధవధార : అర్బన్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని 51వ వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ ప్రారంభించారు. కళింగనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో అపోలో హాస్పిటల్ వైద్యులు పోర్టు పెన్షనర్లకు వైద్య తనిఖీలు నిర్వహించారు. బిపి, సుగర్, ఇసిజి, ఎముకల సామర్థ్య పరీక్షలు చేసి తగు సూచనలను అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు మాట్లాడుతూ, అసోసియేషన్ ఆధ్వర్యాన పోర్టు పెన్షనర్లకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎల్‌జి ఒలెడ్ టీవీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ తమ సరికొత్త సి3 సిరీస్ ఒలెడ్ టీవీని సీతంపేటలోని సంస్థ కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, సాంకేతికంగా ఎల్‌జి బ్రాండ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. వినియోగదారులకు నమ్మకమైన సేవలందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జి రీజినల్ బిజినెస్ హెడ్ జి.కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, రిలయన్స్ క్లస్టర్ హెడ్ ఐమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

వైద్యంపై ఆంక్షలు విరమించుకోవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌లో రోగులు, వారి బంధువులపై విధిస్తున్న ఆంక్షలు తక్షణం ఉపసంహరించుకోవాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ సురేష్ చంద్ర పాండేకు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఉద్యోగుల డిపెండెన్స్‌కు వైద్య సదుపాయం కల్పించడంలో ఆస్పత్రి యాజమాన్యాలు ఇబ్బందులు గురిచేస్తున్నాయని తెలిపారు. రిఫరల్ ఆసుపత్రులలో అనేక టెస్టులు పేరుతో రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని చెప్పారు. అవసరం లేకపోయినా బంధువుల ఆధార్ కార్డు, పాన్ కార్డు అడుగుతున్నారని తెలిపారు. ఈ విషయంలో స్టీల్ ఉన్నత యాజమాన్యం కల్పించుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ములగాడ :కోరమండల్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో మల్కాపురం పోలీసుస్టేషన్ పునర్నిర్మాణ పనులకు సోమవారం సిఐ జి.దేవుడుబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ పోలీస్ స్టేషన్ పునర్నిర్మాణానికి రూ.18 లక్షలు వ్యయం చేస్తుందన్నారు. ఈ మేరకు కోరమాండల్ యాజమాన్యానికి సిఐ ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ సమగ్రత కోసం సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-కరాస: ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి ఆధ్వర్యాన విమానగర్ మెయిన్ రోడ్డులో జాతీయ సమగ్రత కోసం చిన్నారులు జాతీయ పతాకంతో సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిద్వా నాయకులు ప్రభావతి మాట్లాడుతూ, విభిన్న కులాలు, మతాలు, జాతులున్న దేశంలో భిన్నత్వంలో ఏకత్వం గొప్పతనాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విసిసి విమానగర్ సభ్యులు లీల, రోషన్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టును ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి -మాధవధార : లాభాల్లో ఉన్న విశాఖపట్నం పోర్టును ప్రయివేటీకరించొద్దని యునైటెడ్ పోర్టు డాక్ ఎంప్లాయీస్ యూనియన్, విడిఎల్‌బి యూనియన్ ఆధ్వర్యాన సోమవారం పోర్టు హాస్పిటల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు యూనియన్ల కార్యదర్శులు కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు మాట్లాడుతూ, భారతదేశంలో 11 పోర్టులు ఉన్నాయని, వాటిలో విశాఖపట్నం లాభాల్లో నాలుగో స్థానంలో ఉందని చెప్పారు. లాభాల్లో ఉన్న పోర్టును కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెట్టడానికి సన్నాహాలు చేస్తోందని విమర్శించారు. పోర్టు ఆస్పత్రిలో సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల కార్మికులకు వైద్య సదుపాయాలు సక్రమంగా అందడంలేదన్నారు. తక్షణమే నియామకాలు చేపట్టాలని, పోర్టు ఆస్పత్రి ప్రయివేటీకరణ ఆలోచనను విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.స్వతంత్రకుమార్, కార్మికులు పాల్గొన్నారు.



పోర్టు ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

సిపిఐ ప్రచార జాతా పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : 'రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి' నినాదంతో ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు సిపిఐ నిర్వహించే ప్రచార జాతా బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఆరిలోవ కమిటీ ఆధ్వర్యాన సోమవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తూర్పు నియోజకవర్గం కార్యదర్శి షేక్ రెహ్మాన్, జిల్లా సమితి సభ్యులు ఎ.దేవుడమ్మ, ఆరిలోవ కార్యదర్శి కె.లక్ష్మణరావు, సిహెచ్.కాసుబాబు, ఎ.రవి, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే ప్రచార జాతాను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రచార జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ, సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యాన ఈనెల 17వ తేదీన కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి జాతా ప్రారంభమవుతుందని తెలిపారు. జాతాను ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రారంభిస్తారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, సోమేష్, పల్లేటి పోలయ్య, ఎఐటియుసి స్టీల్‌ప్లాంట్ అధ్యక్షులు కెఎస్‌ఎన్.రావు, చీకటి శ్రీనివాసరావు, పప్పు అప్పారావు పాల్గొన్నారు.

102 యూనిట్లు రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న పాండురంగ ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి గాజువాక : లఘు ఉద్యోగి, వాసవ, ఐలా ఆధ్వర్యాన గాజువాక ఆటోనగర్‌లోని ఐలా కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 102 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వాసవ అధ్యక్షులు సజ్జ పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. తాను 40 సార్లు రక్తదానం చేశానని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాన్ని కాపాడగలమన్నారు. రక్తం కొరత ఎక్కువగా ఉండటంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి ఏటా ఆటోనగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేష్, నాగిరెడ్డి, ఎలమంచిలి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వాహన కాలుష్యం అరికట్టాలని నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- గాజువాక : వాహన కాలుష్యం అరికట్టాలని కోరుతూ వై.జంక్షన్ నుంచి గాజువాక జోనల్ కార్యాలయం వరకు శ్రీనగర్‌కు చెందిన వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యాన సోమవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాజువాక జోనల్ కార్యాలయం, గాజువాక తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరణంరెడ్డి నర్సింగరావు, త్రినాధస్వామి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, ఇతర పరిశ్రమలకు ముడిసరుకు రవాణా చేస్తున్న భారీ వాహనాలతో వెదజల్లుతోన్న కాలుష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరిశ్రమలతో పారిశ్రామిక ప్రగతి సాధ్యపడుతుందనుకుంటే అందుకు భిన్నంగా కాలుష్యం ప్రజలను కాటు వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించడం వల్ల సుమారు ఎనిమిది గ్రామాల ప్రజలు వాహన కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని తెలిపారు. చాలామంది రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తరచూ ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వై జంక్షన్ నుంచి వాహనాలను దారి మళ్లించి స్టీల్‌ప్లాంటు రోడ్డు మీదుగా కూర్మన్నపాలెం వైపు వెళ్లేలా రవాణాశాఖ, కాలుష్య నియంత్రణ మండలి, జివిఎంసి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఎనిమిది గ్రామాల ప్రజలను చైతన్య పరిచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు, గాజువాక తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వి.రమణ, మోహనరావు, హనుమంతరావు, ప్రభాకర్, శ్రీనివాసరావు, గూటూరు శంకరరావు, సిరసపల్లి అప్పారావు, కరణం రామకృష్ణ, నాగేశ్వరరావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అక్రమాలు పవన్‌కు కనబడలేదా : అదీప్‌రాజు

ప్రజాశక్తి-పెందుర్తి : టిడిపి అక్రమాలు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కనబడలేదా అని పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు ప్రశ్నించారు. సుజాతనగర్‌లోని వైసిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వరలక్ష్మిని హత్య చేసిన వాలంటీర్‌ను పది రోజుల్లో క్రితమే తొలగించామని చెప్పారు. ఆ వాలంటీర్ జివిఎంసి ఎన్నికల్లో జనసేన నాయకుడు మధు వెంట తిరిగిన విషయాన్ని గుర్తుచేశారు. వరలక్ష్మి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రుషికొండలో ప్రభుత్వం ఆధ్వర్యాన నిర్మిస్తున్న టూరిజం గృహాలపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చినవే ఈ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. కొన్ని వందల ఎకరాల ప్రభుత్వ స్థలంలో కట్టిన గీతం యూనివర్సిటీ పవన్ కల్యాణ్‌కు కనబడలేదా అని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, యువత గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ దేవుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవి సాంబ, పిఎసి చైర్మన్ జి.రామునాయుడు, వైసిపి నాయకులు మురళి, అంజి తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'లో క్రీడలు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురుద్వార్ సమీపంలో ఉన్న నవోదయ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ బిశెట్టి రామ మాట్లాడుతూ, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, రన్నింగ్ పోటీలు, మహిళలకు పలు క్రీడలు నిర్వహించామని చెప్పారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకారం : మేయర్

ప్రజాశక్తి-సీతమ్మధార: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరి సహకారమూ అవసరమని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీలో రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా ఆధ్వర్యాన సోమవారం గో గ్రీన్ పేరుతో నిర్వహించిన మెగా ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్రతి చోటా మొక్కలు పెంచేలా చూడాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కాలేజీ యాజమాన్యం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, కళాశాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



77 మీటర్ల జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

77 మీటర్ల జెండాతో ర్యాలీ

ప్రజాశక్తి-పెందుర్తి: 77వ పంద్రాగస్టును పురస్కరించుకొని స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన 77 మీటర్ల జెండాతో పెందుర్తి నుంచి చినముషిడివాడ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల సెక్రటరీ టి.థియోపిలస్ మాట్లాడుతూ సుమారు 400 మంది విద్యార్థులతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఇండియా గొప్పతనాన్ని, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఐ ఫ్లోరా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిబాబు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ గౌతమ్‌బాబు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రేంజర్స్ కమలరాణి, నాగమణి, మురళీకృష్ణ, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన రైతులకు సాగు పట్టాలివ్వాలని ధర్నా

ఆక్రమణదారులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

గొలుగుండ మండలం, పాత మల్లంపేట రెవెన్యూ పరిధి బుడ్డడపాడు గ్రామంలో అనాదీనం భూమి సాగు చేస్తున్న గిరిజన రైతుల పేరున సాగు నమోదు చేసి, జగనన్న రీ సర్వేలో సాగు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన బాధిత రైతులు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ బుడ్డడపాడు గిరిజన రైతులు అనేక ఏళ్ళగా పాత సర్వే నెంబర్ 842లో సాగులో ఉండగా, వారి పేరున రెవెన్యూ అధికార్లు నేటికీ రెవెన్యూ రికార్డులో సాగు నమోదు చేయకపోవడం అన్యాయమన్నారు. సాగులో లేని అవదానుల విజయం అప్పారావు వగైరాల పేరున ఖాతా నెంబర్లు 439, 440, 441, 442, 443తో పట్టాలు మంజూరు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా సాగులో ఉన్న గిరిజన రైతుల పేరున సాగు నమోదు చేయకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద వంటా వార్పు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, నాయకులు సెగ్గే రాజుబాబు, తూబిరి రాజు, రమణమ్మ, పండియ్య, శివ, బాధిత రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధిత రైతులు, సిపిఎం నాయకులు


పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న జనసేన శ్రేణులు

పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : కశింకోట మండలం విస్సన్నపేట గ్రామంలో భూముల పరిశీలనకు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సోమవారం వచ్చిన సందర్భంగా మండలంలోని ఉమ్మలాడ జంక్షన్లో ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, నాయకులు కె.చంద్రమోహన్, సూరిబాబు, ముల్లేటి ఆనంద్, పెంటకోట నరసింహారావు, బొద్దపు శ్రీను, పైలా రామునాయుడు, పాలుపిల్లి రాము, కె.కాశి, సరోజినీ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సౌకర్యాల కోసం వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు, సదుపాయాలు మెరుగు పరచాలని కోరుతూ సోమవారం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేసి జిల్లా రవాణా శాఖ అధికారి పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ ప్రయాణికులకు కుర్చీలు చాలక, శ్లాబు పెచ్చులూడి వర్షపు నీరు ప్రయాణికులపై పడటం, వినోదానికి ఏర్పాటు చేసిన టివిలు పని చేయక, సరైన లైటింగ్ సౌకర్యం లేక, మంచినీటి వసతి వద్ద పరిశుభ్రత లేక, మరుగుదొడ్ల వద్ద దుర్వాసన, కాంప్లెక్స్ ప్రాంగణమంతా అపరిశుభ్రత వంటి సమస్యలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేశ్ గుప్తా, రొబ్బి మల్లేశ్వర రావు, పట్నాలకృష్ణ మోహన్, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి బుగిడి నూక అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా సోమవారం అనకాపల్లి మండల తెలుగు యువత ఆధ్వర్యంలో స్థానిక గుండాలవీధి వద్ద బీసీ బాలికల వసతి గృహం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందులో పాల్గొన్న టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ మాట్లాడుతూ పీలా గోవింద జన్మదినం ఈనెల 18న నిర్వహించనున్న నేపథ్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సందిన చినబాబు, దాడి జగన్, తెలుగు యువత నాయకులు సందిన సునీల్, మరపురెడ్డి సత్యనారాయణ, కరణం పవన్, చందక నర్సింగరావు, జోగా భాను, కోట్ని సురేష్, మద్దాల వెంకటేష్, పాల్గొన్నారు.


గర్భిణుల సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్

ల్యాండ్ పూలింగ్ రైతులకు ఉచితంగా భూముల రిజిస్ట్రేషన్

- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : 'ల్యాండ్ పూలింగ్' రైతులకు ఉచితంగా భూముల రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. మండలంలోని వేటజంగాలపాలెం గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపిపి గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ల్యాండ్ పోలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు బదులుగా వేరే చోట ఇచ్చిన స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తామన్నారు. దీనికి సుమారు రూ.65 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి దీనికి సంబంధించిన అనుమతులు వస్తాయన్నారు. అనంతరం సుందరయ్యపేటలో రూ.25 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, మండల కార్యదర్శి భీశెట్టి జగన్ పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ బాధ్యతలు అప్పగించాలని మాజీ మంత్రి వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని నర్సీపట్నం గ్రామంలో కొలువైన శ్రీమరిడిమాంబ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తనైన తనకు పూర్తి పరిపాలన బాధ్యతలు అప్పగించాలని జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారికి సోమవారం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు వినతిపత్రం అందజేశారు. సదరు దేవాలయం నర్సీపట్నం సహాయ కమిషనర్ పరిధిలో కార్యనిర్వహణ అధికారి పాలనలో ఉందని, ఈ ఆలయ ఆదాయం ఏడాదికి రూ.5 లక్షలలోపు ఉందని, ఈ నేపథ్యంలో సదరు ఆలయ పరిపాలన బాధ్యతలు తమకు అప్పగిస్తే దేవాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ మల్ల సురేంద్ర, ఆకుల నానాజీ, పిడి ప్రసాద్, బెల్లాన శ్రీనివాసరావు, వేగి కృష్ణ, ఎండకుర్తి అప్పలరాజు, భాను చంద్ర తదితరులు పాల్గొన్నారు.


దేవాదాయ శాఖ అధికారితో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్న

రాజ్యాంగాన్ని రక్షిద్దాం- దేశాన్ని కాపాడుదాం

ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనకాపల్లిలో శ్రీకన్య కళాశాల నుండి నాలుగు రోజులు జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగాన్ని రక్షిద్దాం, దేశాన్ని కాపాడుదాం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భ కార్యక్రమంలో జిల్లా డివైఎఫ్‌ఐ అధ్యక్షులు సిహెచ్.శివాజీ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో దుర్ఘటలను దృష్టిలో పెట్టుకొని కులమత బేధాలు లేని స్వాతంత్ర్యం రావాలని, ఆర్థిక సమానత్వం పోవాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నో పోరాటాలు చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొస్తే అది పూర్తిస్థాయిలో ప్రజలకు అందడం లేదని, విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యా విధానం వల్ల వెనకబడిన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ విద్యార్థులకు రిజర్వేషన్ కోటా లేకుండా మేనేజ్మెంట్ కోట పెంచి తీరని అన్యాయం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్ రమణ, కోశాధికారి గొర్లి తరుణ్, సహాయ కార్యదర్శి బాలాజీ, దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

-ఈ ఏడాది అరకొరగానే వరి నాట్లు
- వరినారును కాపాడుకునేందుకు రైతుల పాట్లు


కాలువ నీటితో చౌడువాడలో నాట్లు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఖరీఫ్ సీజన్ ముగిసే సమయం ఆసన్నమవుతున్నా.. వర్షాలు ఆశించిన స్థాయిలో పడలేదు. వరి నారు ఎండిపోతుండడంతో దానిని కాపాడుకునే ప్రయత్నం రైతులు చేస్తున్నారు. కె.కోటపాడు మండలంలో 90శాతం వర్షాధార వ్యవసాయమే. ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో వరి నాట్లు వేసే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. అడప దడపా కురుస్తున్న వర్షాల వల్ల ఎండిపోతున్న నారికి కొంచెం కొంచెం జీవం పోసినట్లు అవుతుంది. అక్కడక్కడ బోర్లు ఉన్న ప్రాంతాలతో పాటురైవాడ కాలువ ద్వారా వచ్చే గ్రామాల్లో వరి నాట్లు పూర్తి చేశారు. చౌడువాడ, పైడంపేట, రొంగలి నాయుడుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో రైతులు నాట్లు వేశారు. ఈ ప్రాంతంలో చెరకు సాగు ఏ ఏడాదికి ఆ ఏడాది తగ్గిపోతుంది. చెరుకు సాగు చేయని రైతులు వరి వేసే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇంతవరకు కె.కోటపాడు, సింగన్న దొరపాలెం, కింతాడ, ఎ.కోడూరు తదితర గ్రామాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదైంది. అప్పుడప్పుడు కురిసే వర్షాలు నాట్లు వేయడానికి సరిపోవడం లేదని రైతులు అంటున్నారు. ఈ నెలాఖరి వరకు నాట్లు వేసుకోవడానికి సమయం ఉందని, వరి నారు ఎక్కడా ముదురిపోలేదని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సబ్బవరం

మంగళవారం నాటి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నం పర్యటన విజయవంతం చేయాలని తెలుగు యువత అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు(బుచ్చిరాజు) సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం 3 గంటల నుండి బీచ్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి, అనుబంధం సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వికలాంగుల పింఛను పెంచాలని 21న ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : వికలాంగులకు పింఛను రూ.6వేలుకు పెంచాలని కోరుతూ ఈనెల 21న అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. జిల్లాలో 21 రకాలుగా వికలాంగత్వం కలిగి ఉన్నారని, కాని ఐదు రకాల వికలత్వం గుర్తించుటకు మాత్రమే డాక్టర్లు ఉన్నారని తెలిపారు. మిగిలిన 16 రకాల వికలాంగత్వానికి తగిన డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో రాష్ట్రంలో వేలాదిమంది అర్హత ఉన్నప్పటికీ వికలత్వం ధ్రువీకరణ పత్రం పొందలేకపోతున్నారని, పెన్షన్, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వికలాంగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా గుర్తించి చట్ట ప్రకారం వికలాంగుల పథకాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాపేటి భాస్కరరావు, కాండ్రేగుల అప్పారావు, పెట్ల సన్యాసిరావు, ఆర్పి వెంకటరమణ, వి.సూరప్పారావు, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, బి కృష్ణవేణి, శ్రావణి, నూక రత్నం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి నూక అప్పారావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

బహిరంగ సభ జయప్రదంపై ధన్యవాదాలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు బహిరంగ సభలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ సభకు హాజరైన వైవి సుబ్బారెడ్డి, మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్నాథ్, ఎంపీ సత్యవతి, నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులకు ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పళ్ల నర్సింగరావు, దొడ్డి వెంకటరావు, వైసిపి నాయకులు బైన ఈశ్వరరావు, ఒరుగంటి నెహ్రూ, వేచలపు ప్రకాష్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యువజన మందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఈ నెల 15న స్థానిక గ్రామీణ యువజన మందిరం 57వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని మందిర అధ్యక్షులు ఆడారి గంగ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మందిర ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు పతాకావిష్కరణ అనంతరం 10.30 గంటలకు యువతి, యువకులకు ఆటల పోటీలు జరుపబడతాయని తెలిపారు. రాత్రి 7 గంటల నుండి స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం, తులసి కళావేదికపై హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ వారిచే కొరడా మరియు హక్కు అనే సాంఘిక నాటికలు ప్రదర్శింపబడతాయని పేర్కొన్నారు. అనంతరం 7, 10 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులకు, ఆటల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యువి.రమణ మూర్తిరాజు, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, టిడిపి, జనసేన నియోజకవర్గం నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు విజయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

రుషికొండపై అవగాహన లేని మంత్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ రుషికొండపై రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్నాథ్, ఆర్కె.రోజా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు తన శాఖ మీద అవగాహన లేకపోవడం, అసందర్భ ప్రకటనలు చేయడం, చట్ట నిబంధనలు తెలుసుకోకపోవడం, పదవి ఉన్నది కదా అని అధికార దర్పంతో వీర్రవీగడం అలవాటుగా ఉందని విరుచుకుపడ్డారు. తిరుపతిలో వెంకటేశ్వర స్వామి లేడా? శ్రీశైలంలో మల్లికార్జున స్వామి లేడా? విశాఖ కొండలపై రామానాయుడు సినిమా స్టూడియో నిర్మించలేదా? అంటూ మంత్రులు అమర్నాథ్, ఆర్కే, రోజా రుషికొండపై ప్రభుత్వ నిర్మాణాలను సమర్థిస్తూ పొంతన లేని పోలికల పెట్టి మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రుషికొండ సిఆర్‌జెడ్ పరిధిలో ఉందని, ఈ పరిధిలో నిర్మాణాలు చేపట్టాలంటే కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి తీసుకోవాలన్న పరిజ్ఞానం కూడా మంత్రులకు లేదని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కుప్పిలి జగన్, కొట్టి రామకృష్ణ, బోడి వెంకటరావు, మల్ల శివన్నారాయణ పాల్గొన్నారు.

స్పందనకు 282 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుండి 282 అర్జీలు అందాయి. వాటిని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, అసిస్టెంట్ కలెక్టర్ సూరజ్ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి అనిత, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి స్వీకరించారు. అర్జీలకు గడువులోగా తప్పక సమాధానం ఇవ్వాలని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 27 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన స్పందన కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని స్వీకరించిన ఎఎస్పి సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వీటిలో ముఖ్యంగా భూ తగాదాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు ఉన్నాయి.

జిఎస్‌టితో పడకేసిన అభివృద్ధి పనులు

నిధులున్నా ముందుకు రాని కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-చోడవరం

ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిధులు విడుదల చేసినా, యాత వాత జీఎస్టీ కారణంగా ఆ నిధులతో గ్రామాల్లో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. గతంలో కాంట్రాక్టు ఇస్తే చాలు ముందుగా కమిషన్ డబ్బులు సంబంధిత వ్యక్తులకు సమర్పించేవారు. ప్రస్తుతం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయించారు. గ్రామస్థాయిలో ఉన్న నాయకులు కొందరు పనులు చేపట్టారు. జరిగిన పనుల్లో లక్ష రూపాయలకు రూ.18 వేలు జిఎస్‌టి జమ చేసుకోవడంతో పనులు చేసిన వారు లబోదిబోమంటున్నారు. దీనికి తోడు జీఎస్టీ ఎవరైతే చెల్లిస్తున్నారో వారందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలతో పాటు తెల్ల కార్డులు రద్దు అవుతాయన్న భయం వెంటాడుతుంది.

చోడవరం డిఈ పరిధిలో రెండు కోట్ల రూపాయలతో చేపట్టబోయే సుమారు 40 పనులకు నాయకులు ముందుకు రాకపోవడంతో టెండర్ పిలిచారు. అయినా ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. గ్రామస్థాయిలో మంజూరైన పనులను అదరైజేడ్ కాంట్రాక్ట్ చేసేవారికి అప్పగిస్తే యాతవాత జిఎస్టి పోనూ లక్ష రూపాయలకు రూ.36 వేలు కటింగ్ అవుతుందని వాపోతున్నారు. పనులు చేపట్టే ముందు స్టీల్‌కు 18 శాతం, సిమెంట్‌కు 28 శాతం, ఇసుకకు ఐదు శాతం జిఎస్టి కట్టాలి. కొంతమంది పనులు చేసేవారు తమకు ప్రభుత్వ పథకాలు ఎక్కడ పోతాయన్న భయంతో సంబంధిత వ్యాపారుల వద్ద బిల్లులు తీసుకోకుండా ఉండిపోయారు. సంబంధిత పనుల్లో పంచాయతీరాజ్ అధికారులకు బిల్లులు సమర్పించకపోవడంతో వారు పనులు పూర్తయిన తర్వాత నిధులను విడుదల చేస్తూ 18 శాతం జీఎస్టీ మినహాయించి బిల్లులు ఇస్తున్నారు. దీంతో సరుకు కొనేటప్పుడు 18శాతం బిల్లులు చెల్లించేటప్పుడు మరో 18శాతం జీఎస్టీ రూపేనా వదులుకోవాల్సి వస్తుందని పలువురు ప్రజా ప్రతినిధులు ఇటీవల జరిగిన చోడవరం మండల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. జిల్లా కలెక్టర్‌కు ఈ విషయమై ప్రజాప్రతినిధులు మొరపెట్టుకున్నా జీఎస్టీ అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది కాదని సమాధానం చెప్పి సరిపెట్టారని కొందరు ప్రజా ప్రతినిధులు అంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరైనా పనులు చేయడానికి ఏ ఒక్కరూ చొరవ చూపకపోవడంతో నిధులు మిగిలిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న అనైతిక విధానాలతో అభివృద్ధి కుంటు పడుతుందని, దీంతో గ్రామాల్లో ఎటువంటి పనులు చేయలేకపోతున్నామని సర్పంచులు, ఎంపిటిసీలు వాపోతున్నారు.

గ్రామాల్లో 'నా భూమి-నా దేశం'

ప్రజాశక్తి-సబ్బవరం

నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొగలిపురం సచివాలయం వద్ద వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు యడ్ల నాయుడు ఆధ్వర్యంలో సోమవారం అమరవీరుల జ్ఞాపకార్థం దీపాలు వెలిగించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ గండి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీటీసీ గండి రవికుమార్, మాజీ సర్పంచులు టి.బంగారునాయుడు, బి.సత్యం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం శిలాఫలకాన్ని స్థానిక సర్పంచ్ దాడి జగన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోతల వెంకటరావు, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శంకర్, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయం వద్ద నాభూమి- నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి గొర్లి సూరిబాబు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మీ, ఎంజిఎన్ఆర్జిఎస్ ఏపీవో సుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో పందూరు, రామచంద్రపురం, చౌడువాడ, రాజుపేట, గొట్టువాడ, కైలాస పట్నం, జగ్గంపేట, బోడపాలెం, నీలుగుంట, రామచంద్రపాలెం, గ్రామాలలో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాజుపేటలో నివాళులర్పిస్తున్న దృశ్యం

గొలుగొండ : పాతమల్లంపేట గ్రామంలో సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి ఆనంద్ ఆధ్వర్యంలో శిలాఫలకం ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణమ్మ, ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు పాల్గొన్నారు. చీడిగుమ్మల, కంఠారం గ్రామాల్లో నా భూమి నా దేశం కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, కంఠారం సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత గనిశెట్టి

ఎన్‌టిపిసి యాజమాన్యం, కాంట్రాక్టర్లపై చర్యలకు వినతి

ప్రజాశక్తి-పరవాడ : ఎన్‌టిపిసి సింహాద్రిలో ఈ నెల 10న ప్రమాదానికి కారణమైన ఎన్‌టిపిసి యాజమాన్యం, కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. 10వ తేదీన ఎన్‌టిపిసిలో కేబుల్ ట్రె లైన్ కుప్పకూలిన భారీ ప్రమాదంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారని, మరో ఇద్దరు కార్మికులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని తెలిపారు. భద్రతా ప్రమాణాలను యాజమాన్యం పూర్తిగా గాలికొదిలేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాలని, గాయాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం, భరోసా ఏవీ సరిగా చేయకుండానే మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా తరలించారన్నారు. దీనిపై పరిశ్రమ తనిఖీ అధికారి, జిల్లా ఉన్నత స్థాయి అధికారి సమగ్ర విచారణ చేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల జీవితాలను యాజమాన్యం చులకనగా చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కార్మికులతో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

150 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన



150 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో 150 అడుగుల జాతీయ జెండాను మండల కేంద్రం దేవరాపల్లి పురవీధుల్లో సోమవారం ప్రదర్శించి ర్యాలీ చేపట్టారు. దేశ నాయకులకు జేజేలు కొడుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, జెడ్పిటిసి కర్రి సత్యం, తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఎంఈఓ పడాల్ దాస్, వైసిపి నాయకులు బూరె బాబురావు, కొరుప్రోలు శ్రీను, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యాన ర్యాలీ

సబ్బవరం : స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీని సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ ప్రారంభించిన ఈ ర్యాలీ కాలేజీ నుండి జోడుగుళ్ళు, స్టేట్ బ్యాంక్ వరకు సాగింది. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు సూర్యప్రకాష్, మీనాక్షి, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

స్వాతంత్ర్య దినోత్సవంలో కార్మిక, కర్షకులు పాల్గొనాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రైతులు, కార్మికులు, కష్టజీవులు పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎ.బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యలను మననం చేసుకొని స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పునికిపుచ్చుకొని భవిష్యత్ తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం మరో పోరాటానికి ప్రజల సన్నద్ధం కావాలన్న అఖిల భారత స్థాయిలో రైతు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును ప్రతిజ్ఞగా తీసుకొని ప్రతి గ్రామంలోనూ మండల కేంద్రంలోనూ దేశభక్తులంతా స్వతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొవాలని బాలకృష్ణ కోరారు. స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ విధమైన సంబంధంలేని, బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసిన, జాతిపిత మహాత్మా గాంధీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు నేడు పాలకులుగా చలామణి అవుతున్నారని తెలిపారు. ఇది మన స్వాతంత్ర్యానికి చాలా ప్రమాకరమని, మణిపూర్ మంటలే ఇందుకు సాక్ష్యమని బాలకృష్ణ గుర్తు చేశారు.

మెడిటేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో సోమవారం బెంగళూరు బుద్ద సీఈవో వారిచే మెడిటేషన్‌పై అవగాహన కార్యక్రమం రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహించారు. పొలమరశెట్టి చంద్ర మెడిటేషన్ గురించి వివరించి, విద్యార్థుల చేత మెడిటేషన్ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ నిరంజన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం.హరిబాబు, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు, రోటరీ సంస్థ ప్రెసిడెంట్ నాయుడు, సెక్రటరీ అనిల్ పాల్గొన్నారు.

కల్యాణపులోవ అభివృద్ధికి చర్యలు

-ప్రభుత్వ విప్ ధర్మశ్రీ
-జలాశయం నుంచి సాగు నీరు విడుదల

ప్రజాశక్తి-కొత్తకోట:ఆయకట్టు భూములకు సజావుగా సాగు నీరు అందించడంతో పాటు పర్యాటకంగానూ కల్యాణపులోవ జలాశయం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్టు ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం జలాశయం సాగు నీటిని లాంచనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నాలుగేళ్లు పుష్కలంగా పంటలు పండాయని, ఈ ఏడాది రైతుల ఇంట సిరులు కురవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధికార్లు, సిబ్బంది కాలువలపై నిత్యం పర్యవేక్షణ చేసి నీరు వృధా కాకుండా చూడాలన్నారు. జలాశయం దుస్థితి పై రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు వివరించానన్నారు. ఈ మేరకు ఆయన రూ.2కోట్ల 60 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో జలాశయం గట్టుపై పూర్తి స్థాయిలో సిమెంటు రహదారి వేస్తామని, గట్టుపై లైటింగ్ బ్యూటిఫికేషన్, స్నాన ఘట్టాల వద్ద భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. పదేళ్లుగా రిజర్వాయర్ కాలువలలో పట్టిన పూడిక సమస్యకు, పాడైన అక్విడెక్టకు రూ.40 లక్షలతో పరిష్కారం చేపట్టామన్నారు. ములకలాపల్లి, చీమలపాడు వద్ద పాడైన అక్విడెక్టకు మరమ్మతు లు చేపట్టి నీటి వృధా నివారించామన్నారు. పోతురాజుబాబు (శివాలయం)ఆలయం వద్ద టిటిడి నిధులు రూ.80 లక్షలతో మండపం నిర్మాణం, కాశీ నుంచి తీసుకువచ్చిన నూతన శివలింగం ఏర్పాటు, ప్రహరీ నిర్మాణం ఆలయం నుంచి జలాశయం గట్టు రహదారి వరకూ సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, జెడ్పిటిసి తలారి రమణమ్మ ఆదిమూర్తి, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు, స్థానిక సర్పంచ్ వంజరి గంగరాజు, ఎంపిటిసి చిన్ని చినమ్ములు, ఎంపిటిసి ఫ్లోర్ లీడర్ పూడి దేవ, కో ఆప్షన్ మెంబర్ గాలి రమణబాబు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఇరిగేషన్ ఎడి ఈ.స్వామినాయుడు, ఏఈ సత్యనారాయణ దొర, ఆయకట్టు కమిటి నాయకులు గట్రెడ్డి రామునాయుడు, రాజారావు, అబ్బాయిరమణ పలువురు సర్పంచ్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ధర్మశ్రీ



నిరసన చేపడుతున్న మహిళలు

తాగునీటి సమస్యపై నిరసన

ప్రజాశక్తి-కోటవురట్ల:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ పనుల నిర్వహణ మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా కావడంతో మహిళలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సినిమా హాలు సెంటర్ యాతపేట వద్ద తాగునీటి సమస్యపై మహిళలు వార్డు సభ్యులు జానకి హరి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జల జీవన్ కలెక్షన్లు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న పైపులైను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గ్రామీణ నీటి సరఫరా అధికారులను వివరణ కోరగా.. ప్రస్తుతం పైపైన్ కు ట్రెంచ్ నిర్వహించామని త్వరలో అర్హులందరికీ పూర్తిస్థాయిలో కలెక్షన్లు అందజేస్తామన్నారు.

ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్సీపట్నంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అబీద్ సెంటర్ వద్ద ఎన్జీవో హోమ్‌లో బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు డిసిహెచ్ క్రాంతి ఏఐఎస్ఎఫ్ జెండాని ఎగరవేసి ప్రారంభించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. ఫణీంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సీపట్నం టౌన్ సీఐ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు బాలేపల్లి వెంకటరమణ, డిసిహెచ్ క్రాంతి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రామునాయుడు, గురుబాబు, ఏఐవైఎఫ్ నాయకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిత

సమస్యలపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:పాయకరావు పేట నియోజకవర్గంలోని పలు సమస్యలపై స్పందనలో అనకాపల్లి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తెలిపారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ వద్ద పాయకరావుపేట పట్టణంలో ప్రధాన రహదారిని డబల్ రోడ్డు గా నిర్మాణం చేపట్టాలని కోరారు.ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో కొండ వాలు ప్రాంతంలో గ్రామానికి దూరంగా నిర్మిస్తున్న హైస్కూలుని సమీపంగా నిర్మించాలని ఆమె తెలిపారు.



ర్యాలీ చేపడుతున్న క్రైస్తవులు, నాయకులు

మణిపూర్ ఘటనలపై ర్యాలీ

ప్రజాశక్తి-మాడుగుల:మణిపూర్‌ను కాపాడాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో పాస్టర్లు ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులు అన్యాయమని, మహిళలను సైతం వదలి పెట్టకుండా అమానుషంగా హత్యలు చేయడం అన్యాయమని పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత పడాల కొండలరావు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు.

దళిత సంఘాల ర్యాలీ



మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:సంక్షేమ పథకాల్లో అమల్లో వివక్షత చూపిస్తున్నారని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు దళితులకు దక్కలేదని దళిత కులాల సంక్షేమ సేవా సంఘం, దళిత సేవ పరిరక్షణ (డిఎస్పీ)ఆధ్వర్యంలో భారీ ర్యాలీ సోమవారం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి దళితులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అబీద్ సెంటర్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రద్దు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగించాలన్నారు. సబ్ ప్లాన్ నిధులతో కాలనీలు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డికేఎస్ఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు పతివాడ రాంబాబు, జిల్లా అధ్యక్షులు చిట్ల చలపతి, డివిజనల్ అధ్యక్షులు గాతాడ సహదేవుడు, దళిత సేవా పరిరక్షణ (డీ యస్ పి)జిల్లా అధ్యక్షులు యాదగిరి దాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేబాక మధుబాబు, కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, డిబిఎస్ నాయకులు మల్లేటి రాజు, డిఎస్పి నాయకులు మంజేటి నూకరాజు, పలివెల కోటి బాబు, చెక్కా జోగిరాజు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలో సుధీర్ సత్తా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల 13న అనకాపల్లి జిల్లా పరవాడలో జరిగిన మిస్టర్ ఆంధ్ర జోనల్ శరీర సౌష్టవ పోటీలలో నర్సీపట్నంకు చెందిన కుంచెల సుధీర్ కుమార్ 77 కిలోల (హెవీ)విభాగంలో ఐదవ స్థానాన్ని సాధించారు. ఆయన ఇటీవల అనకాపల్లిలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్, అబ్దుల్ కలాం సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జిల్లాస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో నాలుగవ స్థానాన్ని సాధించారు. సుధీర్ కుమార్ తండ్రి శ్రీనివాసరావు బాడీ బిల్డర్. సుధీర్‌కుమార్‌ను ఎఎస్‌పి అదిరాజ్ సింగ్ రాణా అభినందించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు మూడుసార్లు బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొన్నానని, రెండవసారి జిల్లా స్థాయిలో నాలుగవ స్థానం, మూడోసారి జోనల్ స్థాయిలో ఐదవ స్థానం సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.



సుధీర్‌ను అభినందిస్తున్న ఎస్‌పి

బిఎల్ఒపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని అమ్మపేట పంచాయతీకి సంబంధించి బూత్ నంబర్ 47లో ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను ఇప్పటివరకు ప్రారంభించ లేదంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ గొర్లె రవికుమార్ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియకి కేంద్ర ఎన్నికల సంఘం విధించిన 30 రోజుల గడువులో ఇప్పటికే 20 రోజులు పైన గడుస్తున్నా వెరిఫికేషన్ చేయకుండా బూత్ లెవెల్ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంపై గతంలో ఆర్డీవోకి ఫిర్యాదు చేసిన ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. నిర్ణీత గడువులోపు ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి, ఓటర్ లిస్టులో ఎలాంటి అవకతవకలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు కోరినట్లు రవికుమార్ తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో బుచ్చింపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.20లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ ఉలబాల చంద్ర తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో పలు వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు మెయిన్ రోడ్డు నుండి ఉలబాల రాము ఇంటికి, అలాగే మెయిన్ రోడ్డు నుండి రామకోవెల దగ్గరకు, డ్రైనేజీ లేని చోట్ల పైపులు ఏర్పాటు చేసి సిసి రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.



చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు

కాగడాల ప్రదర్శన


ప్రజాశక్తి -కోటవురట్ల:అణుకు గ్రామానికి రహదారి పాఠశాల సౌకర్యం కల్పించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 39వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజనులు దీక్ష శిబిరం వద్ద కాగడాల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు అప్పలరాజు, డేవిడ్‌రాజు, గ్రామానికి చెందిన పలు వురు గిరిజనులు పాల్గొన్నారు.



కాగడాలు ప్రదర్శిస్తున్న నేతలు

జెవివి జిల్లా అధ్యక్షునిగా నాగచంద్ర

ప్రజాశక్తి-మాడుగుల: జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులుగా మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాలపురెడ్డి నాగచంద్ర ఎన్నిక అయ్యారు. కొద్ది కాలంగా తన కోచింగ్ సెంటర్ ద్వారా శిక్షణ ఇచ్చి 135 మంది విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు సాధించడానికి ఆయన ఎంతో శ్రమించారు. చెకుముకి రాష్ట్ర పోటీలకు విద్యార్థులను దూర ప్రాంతాలకు స్వయంగా తీసుకు వెళ్లడం, జెవివి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో జిల్లా పదవి లభించింది. మాడుగుల భారత నిర్మాణ సేన ప్రతినిధి గౌరీ పట్టపు మహేష్ కుమార్‌కు జిల్లా కార్యదర్శి పదవి లభించింది. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.





మాట్లాడుతున్న పివిజి కుమార్

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-మాడుగుల:పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిజి కుమార్ పిలుపునిచ్చారు. మాడుగుల కార్యాలయంలో పార్టీ మండల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పైలా ప్రసాదరావు మాట్లాడుతూ, ఓట్ల నమోదు, తొలగింపు తదితర విషయాల పట్ల కార్యకర్తలు జాగ్రత్త వహించాలని, ప్రతి అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, వేగి రాంబాబు, రంజిత్ వర్మ, సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట:జీవామృతంతో పంటలు ఆరోగ్యం, దిగుబడి ఆదాయం పెంచుకోవచ్చునని మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి అన్నారు. కొంతలం గ్రామంలో జీవామృతంపై అవగాహన కల్పిం చారు. అనంతరం రైతులకు జీవామీతం తయారు చేసుకునే విధానాన్ని దగ్గరుండి చూపిం చారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిఎస్ సాంబమూర్తి, సాయిలక్ష్మీ, సుజాత, భవానీ, రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్



ఎంపిడిఒకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-మాడుగుల:గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్‌లు, ఎలక్ట్రీషియన్ లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, దేముడు నాయుడు, ఏపి గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహమూర్తి డిమాండ్ చేశారు. మాడుగుల మండలంలో కార్మికులు చాలీ చాలని జీతాలతో ఇబ్బందులు పడుతుండగా, వీరికి కొద్ది నెలలుగా జీతాలు అందలేదని, దీంతో ఈ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నాయని తెలిపారు. టెండర్ విధానం రద్దు చేసి ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా, ఎక్కడా అమలు కాలేదన్నారు. పంచాయతీ నిధులు ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్మికులకు బూట్లు, తువ్వాలు, చీపుర్లు, గ్లౌజులు ఇవ్వలేదని, తోపుడు బండ్ల మరమ్మత్తులు కూడా చేయలేదని విమర్శించారు. ఎంపీడీఓ మీనా కుమారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అప్పారావు, ఈశ్వరరావు, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి సత్తా

- రెండు బంగారు పతకాలు కైవశం

ప్రజాశక్తి-కొత్తకోట:రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో కొత్తకోట గ్రామానికి చెందిన ఉపాధ్యాయిని నాగజ్యోతి రెండు బంగారు పతకాలు సాధించింది. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిడబ్ల్యూసి హౌసింగ్ బోర్డ్ కాలనీ పెదగంట్యాడ (గాజువాక)లో 13న ఆదివారం నిర్వహించిన 2వ ఏపీ స్టేట్ డిడ్ లిఫ్ట్ ఛాంపియన్‌షిప్ అండ్ 5వ ఏపీ స్టేట్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్- పవరలిఫ్టింగ్ పోటీలలో 72 కేజీల విభాగంలో పీవీఎం నాగజ్యోతి రెండు బంగారు పతకాలు సాధించింది. రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయనిగా విధులు నిర్వహిస్తున్న ఆమె ఆగస్టు 25 నుంచి 27 వరకు చత్తీస్గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు కూడా ఎంపిక అయ్యింది. ఆమె కుమార్తె సాహితి నీటిలో గంటలు తరబడి పలు విన్యాసాలు ప్రదర్శించి పలు అవార్డులతో పాటు రాష్ట్రపతి అవార్డు పొందింది. నాగజ్యోతిని ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలతో నాగజ్యోతి

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో కర్రి వారి పొలాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి యమ్ అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం రైతులతో కలిసి పాడైన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ట్రాన్స్ ఫార్మర్ కాలిపోవడంతో రైతుల మోటార్లు ద్వారా సుమారు 20 ఎకరాలు వరకు సాగు ప్రశ్నార్థకంలో పడిందన్నారు. వరి నారుమళ్లు ఎండిపోతున్నాయని, వరి చేలు ఉడుపులు కూడా కాక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులు చేపట్టాలని అనేక పర్యాయాలు విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని రైతులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీపాదుల గోవిందరావు, కుక్కులూరి వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో..

మాడుగుల మహనీయులు

ప్రజాశక్తి-మాడుగుల:స్వాతంత్ర్యం కోసం దేశ వ్యాప్తంగా అనేక మంది మహనీయులు నాయకత్వం వహించి జైలు జీవితాన్ని అనుభవించారు. మరెందరో ప్రాణ త్యాగం చేశారు. చరిత్ర కలిగిన మాడుగులలో సైతం కొందరు దేశభక్తి కలిగిన మహానుభావులు పాల్గొని, జైలు జీవితం సైతం గడిపారు. పుట్టా అమరయ్య శెట్టి గుప్త, భమిడిపాటి చిన యజ్ఞ నారాయణ శర్మ, నానా సాహెబ్, వడ్డాది గోపాల భూపతి సేవ వర్మ, కళ్యాణం ధర్మారావు లు ఈ పోరాటంలో పాల్గొన్నారు. వీరిలో అమరయ్య శెట్టి 1921లో విశాఖలో ఏవిఎన్ కళాశాలలో ఇంటర్ చదివే రోజుల్లో మహాత్మా గాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆంధ్ర మహాసభ వాలంటీర్‌గా పని చేశారు. కళాశాల విద్యకు స్వస్తి పలికి మాడుగుల చేరుకుని, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఉ ప్పు సత్యాగ్రహంలో భమిడిపాటి చినయజ్ఞ నారాయణ శర్మతో కలసి పాల్గొని అరెస్ట్ కాబడి బరంపురం, రాయవెల్లూరు జైళ్లలో రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. వీరికి నానాసాహెబ్, వడ్డాది గోపాల భూపతి వర్మ, కళ్యాణం ధర్మారావు వంటి వారు చేదోడుగా వుంటూ ఉద్యమంలో పాల్గొన్నారు. వీరిద్దరూ అరెస్ట్ కావడంతో మాడుగులలో ఉద్యమం ఆగకుండా వుండేందుకు మహాత్మా గాంధీ ఆదేశాల మేరకు తరువాత రాష్ట్రపతిగా పని చేసిన వివి గిరిను మాడుగుల పంపారు. ఆయన పుట్ట అమరయ్య శెట్టి గృహంలో ఉంటూ ఉద్యమానికి ఆధ్వర్యంలో వహించేవారు. జైలులో కాశీనాథుని నాగేశ్వరరావు, బెజవాడ గోపాలరెడ్డి వంటి వారితో పరిచయం ఏర్పరచుకొని, మాడుగుల వచ్చిన తరువాత హిందీ ప్రేమ మండలి ఏర్పాటు చేసి, ఈ ప్రాంతంలో హిందీ భాష అభివృద్ధికి కృషి చేశారు. మాడుగుల కు చెందిన ఇటువంటి మహనీయుల శిలా ఫలకాలు కానీ, చిత్రాలు కానీ లేకుండా పోయాయి.కనీసం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇటువంటి మహాను భావులను స్మరించుకోవడం అవసరం. ఇదే మాదిరిగా అల్లూరి సీతారామ రాజుతో పాటు ఉద్యమంలో పాల్గొన్న అగ్గిరాజు సైతం జైలు జీవితం అనుభవించి, ఆర్ అండ్ బి రాజు గా సుపరిచితులు అయిన ఆయన కుమారుడు వద్ద ఎం.కోడూరులో వుంటూ మృతి చెందారు. ఇలా స్వాతంత్ర పోరాట వీరులను మాడుగుల స్వంతం చేసుకోవడం ఈ ప్రాంతానికి గర్వకారణం



పలువురు సర్పంచులు, వార్డు మెంబర్లు ఏకగ్రీవం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్.నాగాపురం పంచాయతీ 7వ వార్డు మెంబర్ ఇటీవలన రాజీనామా చేయడంతో నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టిడిపి నుంచి నామినేషన్ దాఖలు చేయకపోవడంతో వైసిపి అభ్యర్థి జుర్ర లోవకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతా మహాలక్ష్మి ధృవీకరణ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్‌డి రఘు, సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలో రెండు పంచాయతీల్లో రెండు వార్డు మెంబర్లు ఉప ఎన్నికలకు సంబంధించి పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను సోమవారం అధికారులు ప్రదర్శించారు. రేబాక పంచాయతీ 3వ వార్డుకు సాదిరెడ్డి బుజ్జమ్మ ఒక్కరే నామినేషన్ వేయడంతో వార్డ్ మెంబర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్వో సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు వెల్లడించారు.చినదొడ్డిగల్లులో 1వ వార్డుకు సంబంధించి రెండు నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.ఈ వార్డుకు దాడిశెట్టి ఈశ్వరరావు, నాయుడు నానాజీ పోటీలో నిలిచినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డు వద్ద అభ్యర్థుల జాబితాను ప్రదర్శించారు.చినదొడ్డిగల్లులో 1 వార్డుకు సంబంధించి ఈనెల 19వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నారు.

రావికమతం:కవగుంట రెండో వార్డు, తట్టబంద ఎనిమిదవ వార్డుకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో కవగుంట గ్రామానికి కంటముకి కు జానకి, తట్టబందకు నెమ్మి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చైతన్య, ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. దీంతో వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కవగుంట పంచాయతీ కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.



నియామక పత్రం ఇస్తున్న కార్యదర్శి జయ ప్రకాష్

ఉపమాక సర్పంచ్‌గా వీరబాబు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ సర్పంచ్‌గా ప్రగడ వీరబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా ఉన్న గోనగాల అప్పలనర్స తన పదవికి రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్ గా ఉన్న ప్రగడ వీరబాబు ను సర్పంచ్‌గా నియమిస్తూ డిపిఓ శిరీషా రాణి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు సోమవారం ఉదయం ఉపమాక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ నియామక పత్రాన్ని ప్రగడ వీరబాబుకు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీరబాబు మాట్లాడుతూ, గ్రామ పెద్దల సలహాలు తీసుకుంటూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జడ్పిటిసి మాజీ సభ్యులు కురుందాసు నూకరాజు, పంచాయతీ సిబ్బంది, వార్డు మెంబర్లు గురు భవాని, దవరసింగి రాంబాబులు వీరబాబుకు శు భాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, కొంకిపూడి సూరిబాబు, కొప్పిశెట్టి రమణ, దొరబాబు, శ్రీను, సత్తిబాబు, దేముళ్ళు, రవి, సిద్దాబత్తుల నూకతాత, సత్తిబాబు, గోర్స శ్రీనివాస్, తోలేటి శ్రీను, వాసు, రాము, హరి, నూకరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు .

బుచ్చయ్యపేట సర్పంచ్‌గా లక్ష్మి

బుచ్చయ్యపేట :బుచ్చయ్యపేట సర్పంచ్‌గా సుంకర లక్ష్మి ఎన్నిక ఏకగ్రీవమైంది. రెండేళ్ల క్రితం పంచాయతీ ఎన్నికల్లో బుచ్చయ్యపేట సర్పంచ్‌గా సుంకర సూరిబాబు ఎన్నిక య్యారు. ఆయన గత ఏడాది రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో ఈ స్థానానికి ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. సూరిబాబు సతీమణికి సర్పంచ్‌గా అవకాశం ఇవ్వాలని గ్రామానికి చెందిన వైసిపి, టిడిపి పెద్దలు తీర్మానించారు. దీంతో సర్పంచ్ అభ్యర్థిగా సూరిబాబు సతీమణి సుంకర లక్ష్మి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. స్క్రూట్నీ అనంతరం ఆర్వో కామేశ్వరరావు సోమవారం సుంకర లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువపత్రాన్ని అందజేశారు.



నియామక పత్రం స్వీకరిస్తున్న లక్ష్మి



సంబరాల్లో పాల్గొన్న వి సెజ్ సిబ్బంది

వి సెజ్‌లో.. స్వాతంత్ర్య సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ:వి సెజ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విసెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల ఆధ్వర్యంలో సీనియర్ అధికారులు, సిబ్బంది, ప్లాంట్ హెడ్‌లు, సెక్యూరిటీ సిబ్బంది అందరికీ జాతీయ జెండాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తమ ఇళ్ల వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో రోష్ని అపరంజి కొరటి, ప్రసాద్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ బ్యాంకు 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను బ్యాంకు విశాఖ మెయిన్ బ్రాంచిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బ్యాంక్ జోనల్ మేనేజర్ సిహెచ్.వెంకట రమణరావు మాట్లాడుతూ బ్యాంకు ప్రగతిని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వై.రామా తమ స్వాతంత్ర్యో ద్యమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో మెయిన్ బ్రాంచి మేనేజర్ బి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న బ్యాంకు సిబ్బంది

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఉదయం మేజర్ పంచాయితీ తిమ్మాపురం గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమం, అభివృద్ధి పథకాలపై అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందకపోతే అవి సరిచేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రి సత్యన్నారాయణ, జెడ్పీటిసి కాకర దేవి, వైకాపా నాయకులు బొలిశెట్టి గోవిందరావు, కొణతాల శ్రీనువాసరావు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
77వ స్వాతంత్ర్య దినోత్సవ
43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
విశాఖపట్నం | మంగళవారం 15-08-2023 | 12 పేజీలు

ఉద్యమ కెరటం.. విశాఖ

◆ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర
◆ నేడు ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఉద్యమ వేదిక

ప్రజాశక్తి - విశాఖపట్నం

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నేటికీ విశాఖలో కొనసాగుతోంది. నాడు ఎన్నో పోరాటాలకు వేదికగా నిలిచిన ఈ నగరం ఇప్పటికీ పోరుగడ్డగా జన హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల వేళ ఓసారి చరిత్రపుటను తిరగేస్తే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ... కొత్త సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్న భారతదేశం, అందునా పోరు విశాఖ మన కళ్ల ముందు కదలాడతాయి. బ్రిటీష్ వారిపై తొలి రోజుల్లోనే తిరుగుబాటు చేసిన ఘన చరిత్ర విశాఖ ప్రజలది.

ఇప్పుడు విశాఖ పేరు వినగానే ఇక్కడున్న ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు, హెచ్‌పిసిఎల్, భెల్, రక్షణ రంగం, రైల్వే, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) వంటి కీలక పరిశ్రమలు గుర్తుకురాక మానవు. ఇవన్నీ నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి పతాకగా వెలుగొందుతున్నాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఢిల్లీ గద్దెనెక్కిన కాషాయ పాలకుల పుణ్యమా అని.. స్వాతంత్ర్య స్ఫూర్తితో ఆవిర్భవించిన ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కొక్కటిగా అంతర్ధానమైపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయి. వీటి ఏర్పాటుకు నాడు, ప్రభుత్వ రంగ పరిరక్షణకు నేడు సాగుతున్న ఉద్యమాలకు స్వాతంత్రోద్యమ చరిత్రే వారసత్వంగా దర్శనమిస్తోంది. విశాఖకు స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతో దగ్గర సంబంధం, విడదీయరాని బంధం ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదు..

ఉద్యమ బీజాలు

నాడు విశాఖలో సాగిన ఉప్పు సత్యాగ్రహం, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నేటికీ కొనసాగుతుండటానికి ఈ ప్రాంత ప్రజల పట్టుదల... పోరాటాల పట్ల నిబద్ధతే కారణం. స్వాతంత్ర్య ఉద్యమ మూలాలు మన విశాఖతో పెనవేసుకుని ఉండడం నిజంగా గర్వకారణమనే చెప్పాలి. దేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమేందుకు ఉద్యమ పతాకను ఎగర వేయగా... ఆ తర్వాత స్వతంత్ర్య గడ్డపైనా ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, తీర ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ సాధన కోసం ఉద్యమాలు సాగాయి. ఒక్కో ఉద్యమం (మిగతా 12లో..)



విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం తలపెట్టిన ర్యాలీలో జాతీయ జెండాలతో పాల్గొన్న కార్మికులు (ఫైల్‌ఫొటో)



చారిత్రక తార్కాణాలు.. డచ్ సమాధులు

ప్రజాశక్తి - భీమునిపట్నం

భీమిలి ప్రాంతంలో తొలినాళ్లలో జరిగిన విదేశీ వర్తక, వ్యాపార కార్యకలాపాలకు సాక్షాలుగా నేటికీ డచ్ సమాధులు దర్శనమిస్తున్నాయి. పాండవ మధ్యముడైన భీముని పేరుతో పిలవబడే భీమునిపట్నం ప్రాచీన చరిత్రకు ప్రతి రూపం. ఈ ప్రాంతం కొంత కాలం బౌద్ధ మతానికి ఆలంబనగా నిలిచింది. కళింగ యుద్ధానంతరం బౌద్ధాన్ని అనుసరించిన అశోకుడి శాంతి ప్రయత్నాన్ని తిలకించింది. ఆదిశంకరుడి బోధనలతో పునీతమైంది. తర్వాత ఎందరో చక్రవర్తులు, రాజులపాలనలో ఉన్న భీమిలి చివరికి పాశ్చాత్య దేశాల వారి ఆధీనంలోకి వెళ్లింది. ఇలా వచ్చిన వారెందరో ఉన్నా భీమిలిలో డచ్ (నెదర్లాండ్స్), ఇంగ్లాండ్ (గ్రేడ్ బ్రిటన్) దేశస్తులు స్థిరపడ్డారు. దాదాపు నాలుగు వందల ఏళ్ల కిందట డచ్ దేశీయులు స్థిరపడ్డారు. వారిని ఇక్కడి నుంచి తరిమికొట్టిన బ్రిటీష్ పాలకులు భీమిలిని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ఈ రెండు యూరోపియన్ జాతుల వారు భీమిలిలో చాలా కాలం పాటు నివసించారు. సహజంగానే వారిలో కొందరు ఇక్కడ మరణించారు. క్రైస్తవ సంప్రదాయం ప్రకారం వారిని భీమిలిలో, పరిసర ప్రాంతాల్లో ఖననం చేసి సమాధులు నిర్మించారు. ఇన్నేళ్ల తర్వాత ఆ సమాధులే గత చరిత్రకు అద్దం పడుతున్నాయి. మరుగున పడిన ఈ సమాధులు వెలుగు చూడడానికి ఓ స్థానికుడు నిరుపమాన కృషి చేసి అలనాటి చరిత్రను అందరికీ పరిచయం చేశాడు.

నిరుపమాన కృషి ఇలా...

భీమిలిలో విదేశీ సమాధుల గురించి ప్రస్తావించినప్పుడు చిట్టివలసకు చెందిన సంబారపు శామ్యూల్ రాబర్ట్స్ గురించి తలచుకోవడం ఎంతైన అవసరం. భీమిలి చరిత్ర మీద ఆసక్తి కొద్దీ ఆయన ఇక్కడున్న విదేశీయుల సమాధులను వెలికి తీయడానికి ఎంతో శ్రమించారు. బ్రిటీష్ అసోసియేషన్ ఫర్ సిమెట్రీన్ ఇన్ సౌత్ ఏషియా (దక్షిణాసియాలోని క్రైస్తవ సమాధులను అధ్యయనం చేసే బ్రిటీష్ సంస్థ బాక్సా) నేతృత్వంలో భీమిలిలో సమాధుల గురించి అధ్యయనం చేసింది. భీమిలి మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిపాలెంలో రోడ్డు పక్కన ఉన్న 14 సమాధులను వెలుగులోకి తీసుకురావడానికి ఎంతో శ్రమించారు. మూడేళ్లు కష్టబడి మూడడుగల లోతు భూమిలో కూరుకుపోయిన సమాధులను వెలికి తీయంచగలిగారు. డచ్ ప్రభుత్వానికి, చనిపోయినవారి వారసులకు ఈ సమాచారాన్ని అందించారు. వార్ధక్యాన్ని లెక్క చేయకుండా ఆయన చేసిన కృషిని పురావస్తుశాఖ గుర్తించింది. ఈ సమాధులను పురావస్తు సంపదగా గుర్తించి వాటి పరిరక్షణకు ఏర్పాట్లు చేసింది. నాటి డచ్ లిపి, వారి వాస్తు కళ, ఆచారాలు ఈ సమాధులను బట్టి అర్థమవుతాయని చరిత్రకారులు అంటారు.

కుమ్మరిపాలెంలో 14 సమాధులు వెలుగు చూసిన తర్వాత రాబర్ట్స్ అక్కడితో ఆగిపోలేదు. మరింత కృషి చేసి 15వ సమాధిని కనుగొన్నారు. హేర్ అన్‌డర్లీ అనే వ్యక్తిని ఖననం చేసిన చోటును గుర్తించి అక్కడ ఉన్న సమాధి మీద ఉన్న లిపిని, అక్కడి వాస్తు కళను ఆధారంగా చేసుకుని అది కూడా హాలెండ్ దేశీయుడి సమాధిగా రుజువు చేశారు.



భీమిలి తీరంలోని డచ్ సమాధులు

రేవు సిబ్బంది సమాధులు

భీమిలి తీరంలో చాలా కాలం కిందటి నుంచి 24 సమాధులు కనిపిస్తూ ఉండేవి. వీటిని డచ్ దేశస్తుల సమాధులుగా ప్రచారం చేసేవారు. రాబర్ట్స్ వీటి గురించి పరిశోధన చేశారు. సముద్ర తీరంలో ఉన్న ఈ సమాధి వాటికను 'సిమెట్రీ ఆఫ్ ఫ్లాగ్ స్టాఫ్'గా ఆయన నిర్ధారించారు. వీటిని నౌకలకు దారి చూపే సిబ్బంది సమాధులుగా ఖరారు చేశారు. వీటిలో మూడే హాలెండ్ దేశస్తుల సమాధులని ప్రకటించారు. మిగిలినవి ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశస్తుల సమాధులుగా తెలిపారు. ఇవి 1,500 సంవత్సరం నాటివని తేల్చి చెప్పారు. అలా భీమిలి సమాధుల వివరాలు బాహ్య ప్రపంచానికి తెలియడంతో ఆయన ఈ ప్రాంతానికి చెందిన విశిష్ట చరిత్రకారుడిగా గుర్తింపు పొందారు.

సాటిలేని మేటిభాష

పల్లవి :
సాటిలేని మేటి తెలుగుభాష మనదిరా
పోటీలేని తెలుగు సంస్కృతీ మనదిరా
గర్వించదగిన తెలుగు జాతి మనదిరా
కీర్తించదగిన ఉత్తమ చరిత మనదిరా

చరణం: 1
తిట్టయినా తెలుగులో తిట్టుకుందాముర
ఒట్టయినా తెలుగులో పెట్టుకుందాముర
మాతృభాషలో మనం చదువుకుందాముర
పరభాషలలో పరిణితిని సాధించుదాముర

చరణం: 2
తెలుగులో పిలిచే పిలుపతిమధురమ్మురా
పాలనా భాషగా అది అతి సులభమ్మురా
ఎప్పుడైన మాసిపోని చరిత్రంతా మనదిరా
ఎంతైనా మరువరాదు మన ఘనతనురా

చరణం: 3
అక్షరాల తలకట్లే తెలుగింటి పంచెకట్లు
అంబుధులను దాటే మన తెలుగు ఒక
తేనెపట్టు
తెలుసుకుంటే సులువౌను దానిలోని కనికట్టు
విశ్వవిఖ్యాతమై అది నీడనిచ్చు చెట్టురా

చరణం: 4
మనమంతా తెలుగు పాట పాడుకొందాముర
జగమంతా
తెలుగువెలుగు
పంచుకుందాముర
అన్ని భాషలందు
ప్రముఖ భాషగా
చేద్దాముర
మనభాషే మేటిదని
ఎలుగెత్తి చాటరా!

– రచన :
పల్లి నల్లనయ్య



తీరంలో కొత్త సొబగులు

- రుషికొండ ఐటి జంక్షన్ వరకూ రోడ్ల విస్తరణ పనులు
- సముద్ర ఒడ్డున ఇసుకలో యంత్రాలతో చదును
- చకచకా సుందరీకరణ పనులు




విశాఖ తీరంలోని అందాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ సాగర తీరంలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. రుషికొండ ఐటి జంక్షన్ వరకూ పలు రోడ్లను లింక్ చేస్తూ విస్తరణ చేపట్టారు. విశాఖపట్నాన్ని ఎగ్జిక్యూటివ్ కేపిటల్ చేసేందుకు కట్టుబడి ఉన్నామంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా అతని మంత్రివర్గం, ఎమ్మెల్యేలూ చెబుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేపిటల్ ఏరియాగా ప్రభుత్వం నిర్దేశించిన సాగర్‌నగర్, పిఎం.పాలెం, మధురవాడ, రుషికొండ మొదలు భీమునిపట్నం వరకూ సుందరీకరణ పనులు సాగుతున్నాయి. అంతేగాక ఆర్‌కె బీచ్, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, రుషికొండ నుంచి భీమునిపట్నం వరకూ సముద్రపు ఒడ్డు అంతటినీ యంత్రాలతో వారం రోజులుగా చదును చేస్తున్నారు. బీచ్‌లో ఇసుకను చాలా వరకూ తీసేసి శుభ్రం చేశారు.

తాజాగా జిల్లా ఉన్నతాధికారులు సైతం 'రాజధాని' ఏర్పాట్లను పరోక్షంగా ధ్రువీకరిస్తున్నారు. ఇప్పటికే పది ఎలక్ట్రిక్ ఆటోలను ఆర్‌కె బీచ్ నుంచి సాగర్‌నగర్ వరకూ ఉచితంగా ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ డ్రైవర్లకు రూ.14 వేలకు పైగా జీతాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే అటవీశాఖ భూమి అధికంగా సాగర తీరం వెంబడి ఉండడంతో 'గ్రీన్ ఆర్మీ' పేరుతో 25 మందిని సాగర తీరం వెంబడి డ్యూటీలకు వేసింది. ఇటీవలే వీరిని రిక్రూట్‌మెంట్ చేసి నెలకు రూ.18 వేల జీతం ఒక్కొక్కరికీ ఇస్తోంది. బీచ్ రోడ్డుకు ఇరువైపులా డివైడర్లపై మొక్కలను పర్యవేక్షించడమే వీరి పని. రాత్రి, పగలూ వీరు ఆర్‌కె బీచ్ నుంచి రుషికొండ వరకూ విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం అనేక ప్రాజెక్టులనూ చకచకా చేపట్టడం గమనార్హం. హనుమంతవాక జంక్షన్ నుంచి జోడుగుళ్ల పాలెం వెళ్లే 50 అడుగుల రహదారిని 80 అడుగులకు విస్తరించే పనులు మొదలయ్యాయి. కేపిటల్ ఏరియా డవలప్‌మెంట్‌గా దీన్ని అధికారులు కొంతమంది పేర్కొంటున్నారు. పిఎం పాలెం హైవే నుంచి నేరుగా ఐటి రుషికొండ జంక్షన్ వరకూ కేపిటల్ ఏరియా డవలప్‌మెంట్‌లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.


ఉచిత ప్రయాణ ఆటోలు

వైజాగ్ స్క్వేర్

నగరం నడిబొడ్డున దత్ ఐలాండ్ వద్ద ఏర్పాటైన వైజాగ్ స్క్వేర్ ఇప్పుడు టాక్ ఆఫ్ సిటీగా ఉంది. వ్యూహాత్మక పట్టణీకరణలో భాగంగా పాదచారులకు కాసింత ఉపశమనాన్ని కలిగించేందుకు అద్భుతమైన పెయింట్లు వేసి యురోపియన్ స్టైల్‌లో సరికొత్త స్ట్రీట్‌ను ఇక్కడ జివిఎంసి సృష్టించింది. 'టాక్టికల్ అర్బనిజం' అనే కాన్సెప్ట్ నుంచి ప్రేరణ పొందిన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ నగరం నడిబొడ్డున పాదచారుల కోసం ప్రత్యేక స్థలాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సమకూర్చింది. సిరిపురం జంక్షన్‌లో ఉన్న దత్ ఐలాండ్ నుంచి సంపత్ వినాయక్ టెంపుల్‌కు వెళ్ళే మార్గంలో వంద మీటర్ల స్థలాన్ని గతంలోనే ఖాళీ చేయించి పెద్దగా ఉపయోగంలోకి లేకుండా రిజర్వ్ చేశారు. ఇప్పుడు ఆ స్థలంలో టాక్టికల్ పట్టణీకరణలో భాగంగా యురోపియన్ స్టైల్‌లో ఒక వాక్ స్ట్రీట్‌ను జివిఎంసి తయారు చేయించింది. చూడముచ్చటైన రంగులతో తీర్చిదిద్దింది. ఇక్కడ సెల్ఫీలు తీసుకునేందుకు నేడు పర్యాటకులు, పట్టణ వాసులు ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఈ వైజాగ్ స్క్వేర్ చుట్టూ ఇప్పుడు ట్రాఫిక్ సమస్య పెద్ద చిక్కుగా మారింది.


వైజాగ్ స్క్వేర్ వద్ద యువత సందడి

బాక్సైట్, మాంగనీస్ హ్యాండ్లింగ్‌లో..

విశాఖ పోర్టు రికార్డు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకే నెలలో అత్యధికంగా బాక్సైట్, మాంగనీసును హ్యాండ్లింగ్ చేయడంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ నూతన రికార్డు నెలకొల్పింది. జులై 2023లో పాత రికార్డులను తిరగరాస్తూ ముందుకు సాగింది. గడిచిన జులైలో 2,59,242 మెట్రిక్ టన్నుల బాక్సైటును విశాఖపట్నం పోర్టు హ్యాండిల్ చేసి రికార్డు సాధించింది. 2016 సెప్టెంబరులో నాలుగు నౌకల ద్వారా వచ్చిన 1,81,741 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ను పోర్టు హ్యాండిల్ చేయగా అదే ఇప్పటి వరకూ రికార్డుగా ఉంది. ప్రస్తుతం ఈ రికార్డును పోర్టు తిరగరాసింది. ఇక మాంగనీస్ హ్యాండ్లింగ్‌లో కూడా పోర్టు నూతన రికార్డు నెలకొల్పింది. గడిచిన జులైలో 12 నౌకల ద్వారా 3,66,752 మెట్రిక్ టన్నుల మాంగనీసును పోర్టు హ్యాండిల్ చేసింది. గతంలో 2022 మేలో 3,60,666 మెట్రిక్ టన్నుల మాంగనీసును పోర్టులో హ్యాండిల్ చేశారు. ఇప్పటి వరకూ ఇదే పోర్టులో ఒకే నెలలో అత్యధికంగా మాంగనీసును హ్యాండిల్ చేసిన రికార్డుగా ఉంది. ప్రస్తుతం ఈ రికార్డును పోర్టు అధిగమించింది. తాజా రికార్డులపై పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరును కొనియాడారు. పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, కార్యదర్శి టి.వేణుగోపాల్ కూడా తాజా రికార్డులపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన సిబ్బందిని ప్రశంసించారు.



రికార్డుల మోత మోగిస్తున్న విశాఖ పోర్టు

రాజకీయాల్లో చురుగ్గా తిప్పల దేవన్‌రెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు తిప్పల దేవన్‌రెడ్డి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తిప్పల దేవన్‌రెడ్డి తన అదృష్టం పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఆ ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని చూస్తున్నారు. ఇంతవరకు ఆయన తండ్రి తిప్పల నాగిరెడ్డి ఎమ్మెల్యే గెలుపు కోసం వెనుక ఉండి కష్టపడి పనిచేసిన అనుభవం ఉంది. నాగిరెడ్డి మొదటిసారి కార్పొరేటర్‌గా గెలిచినప్పుడు, తర్వాత స్వతంత్రంగా పోటీ చేసినప్పుడు, రెండుసార్లు వైసిపి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి చేసినప్పుడు మొత్తం బాధ్యత అంతా దేవన్‌రెడ్డి చూసుకున్నారు. గాజువాకలో ఉన్న క్యాడర్, ఇతర రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. తండ్రి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గ బాధ్యతలు అన్నీ దేవన్‌చెడ్డి చూసుకుంటున్నారు. నియోజవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆ ఇంటికి వెళ్లి ఆదుకున్న సందర్భాలు ఉన్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం, తదితర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుల్లో ఆయన పాల్గొని పూర్తిచేశారు. నియోజక వర్గాన్ని అంటి పెట్టుకొని ఉంటూ సేవే లక్ష్యంగా పనిచేస్తున్నారు. దేవన్‌రెడ్డికి సొంత కేడర్ ఉంది. దానికి వైసిపి పథకాలు తోడైతే గెలుపు చాలా సులువు అని భావిస్తున్నారు. ఇప్పటికే సర్వేలో కూడా ఈయన పేరును పరిశీలనలోకి వచ్చింది. యువకుడు ఇంజినీరింగ్ గ్రాడ్యూట్, అందరితో కలిసే స్వభావం ఉండటం వల్ల నియోజవర్గంలో ఆయనకు ఒక గుర్తింపు లభించింది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి. ఇంటికి వచ్చిన వారికి ఏదో ఒక రూపంలో సహాయపడుతూ ఉండడం వల్ల నియోజవర్గంలో ఆదరణ కూడా పొందారు. జివిఎంసి ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పనిచేసి ఆయన సత్తా చూపించుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలోనూ ఆయన పాల్గొన్న సందర్భాలు చాలా ఉన్నాయి. నియోజవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేయడమే కర్తవ్యంగా భావిస్తున్నారు. నియోజవర్గంలో అవినీతి ఆరోపణలు కూడా లేకపోవడం ఆయనకొక ప్లస్ పాయింట్‌గా భావిస్తున్నారు.



క్యాడర్ దందాలు, రౌడీయిజం చేయకుండా చెక్ పెట్టడం ఆయనకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. దేవన్‌రెడ్డికి ఎమ్మెల్యే సీటు వస్తే ఆయన గెలుపు కోసం కష్టపడతామని వైసిపి కేడర్ కూడా చెబుతోంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తే అన్ని అంశాలూ తిప్పల దేవన్‌రెడ్డికి కలిసి వచ్చే విధంగానే ఉన్నాయి.

విలక్షణ సంపాదకుడు కృష్ణారావు

ప్రజాశక్తి- విశాఖపట్నం : కృష్ణా పత్రిక సంపాదకత్వ బాధ్యతలను చిరకాలం నిర్వహించిన ముట్నూరి కృష్ణారావు ఒక విలక్షణమైన సంపాదకునిగా పేరు ప్రతిష్టలను సంపాదించుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఆయన సంపాదకత్వంలో నిర్వహించబడిన కృష్ణా పత్రిక స్వాతంత్ర్య పిపాసకులను ఎంతగానో ఉత్తేజపరిచేది. ఆ రోజుల్లో స్వాతంత్ర్య ఉద్యమానికి పట్టుగొమ్మగా వ్యవహరించిన ఆంధ్ర పత్రికను మితవాద పత్రికగాను, కృష్ణా పత్రికను అతివాద పత్రికగానూ చాలామంది భావించేవారు. 20వ శతాబ్దం ప్రారంభం నాటికే స్వేచ్ఛాకాంక్షతో తెలుగు పత్రికలు పరాయి బ్రిటీష్ పాలకుల పట్ల ఏవగింపును కలిగించే ధోరణిలో ఉండేవి. ఆనాడు కృష్ణా, గుంటూరు జిల్లాలు కలిసే ఉండేవి. మచిలీపట్నం ముఖ్య పట్టణంగా ఉండేది. అక్కడి నుంచి 1902లో కృష్ణా జిల్లా అసోసియేషన్ తరపున దేశభక్త కొండా వెంకటప్పయ్య కృష్ణా పత్రికను వారపత్రికగా ప్రారంభించారు. వేడినందుకుంటున్న వందేమాతరం ఉద్యమకాలంలో కృష్ణాపత్రిక తెలుగు పాఠకులను తన శక్తివంతమైన వ్యాసాలతోనూ, వ్యాఖ్యలతోనూ ఉత్తేజాన్ని కలిగించేది. ఆ పత్రికలో సహాయ సంపాదకుడుగా ముట్నూరి కృష్ణారావు 1903లో చేరారు. కొండా వెంకటప్పయ్య తన న్యాయవాద వృత్తిని వదులుకొని గుంటూరు వెళ్లిపోవడంతో ఆ పత్రికకు కృష్ణారావు ఎడిటర్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. కృష్ణారావు సంపాదకత్వంలో కృష్ణాపత్రిక ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న అతిం గొప్ప పత్రికల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. కలాన్ని ఖడ్గంగా ఝుళిపించుతూ నిద్రాణమైన మారుమూల గల తెలుగు ప్రజలను కూడా తట్టిలేపిన మహనీయ సంపాదకుడాయన.

తెల్లదొరలను వణికించిన విశాఖ

ప్రజాశక్తి – విశాఖపట్నం

స్వాతంత్ర్యోద్యమంలో విశాఖ జిల్లా నేతలు కీలకపాత్ర పోషించారు. తెల్లవాడిపై తొలిపోరాటం, ఉప్ప సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల్లో నేతలు పాల్గొన్నారు. ఎందరో నేతలు బ్రిటిష్ పోలీసుల చేతుల్లో లాఠీదెబ్బలు తిన్నారు. అరెస్టయ్యారు. జైలుశిక్షలు అనుభవించారు. ఎవిఎన్, ఆంధ్రా మెడికల్ కళాశాలల విద్యార్థులు అనేక మంది చదువుకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టులూ కీలకపాత్ర పోషించారు. విశాఖ, అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పోరాటాలు నడిపారు.

తెల్లవాడిపై తొలి పోరాటం

తెల్లవాడిపై తొలిపోరాటం జరిగిన పద్మనాభం యుద్ధం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వలసపాలనతో దేశంలోని సహజ వనరులు దోపిడీకి గురయ్యాయి. అప్పట్లో బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేకచోట్ల పలు రూపాల్లో పోరాటాలు సాగాయి. విశాఖ జిల్లాలోని పద్మనాభం యుద్ధం కూడా అందులోభాగమే. ఇది ఒక సంస్థానానికి, బ్రిటిష్‌వారికి మధ్య జరిగిన యుద్ధమే కావచ్చు. కానీ, బ్రిటీష్ సామ్రాజ్యవాదుల దోపిడీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధం. విజయనగరానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న పద్మనాభం (విశాఖ జిల్లా)లో ఈ యుద్ధం జరిగింది. అందువల్లనే పద్మనాభం యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. యుద్ధంలో ఆంగ్లేయుల ఆధునిక ఆయుధాలకు రెండో విజయరామరాజు సాధారణ ఆయుధాలు కొరగాకుండా పోయాయి. యుద్ధంలో రెండో విజయరామరాజుతోపాటు 309 మంది వీర మరణం పొందగా, బ్రిటిష్ సైనికులు 13మంది మృతి చెందారు.

గిరిజన తిరుగుబాట్లు

అడవిపై బ్రిటీష్ పాలకులు తీసుకొచ్చిన నిరంకుశ చట్టాలకు గిరిజనులు వ్యతిరేకించారు. 1845లో గొలుగొండ ఏజెన్సీ ప్రజలు ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శిస్తులు చెల్లింపునకు నిరాకరించారు. ప్రభుత్వ సైన్యాలను, పోలీసులను తమ గెరిల్లా పోరాటం ద్వారా మూడేళ్లపాటు ప్రతిఘటించారు. సిపాయిల తిరుగుబాటు జరిగిన 1857లో గొలుగొండ ఏజెన్సీ ప్రజలు కూడా తిరుగుబాటు జరిపారు. 1879లో ఏజెన్సీ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా రంప తిరుగుబాటు జరిగింది. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వీరయ్యదొరను బ్రిటీష్ పోలీసులు కాల్చి చంపారు. 1858, 1861ల్లో సాగిన రైతు తిరుగుబాట్లు, 1879లో జరిగిన రంప పితూరీ విశాఖ మన్యాన్ని కదిలించింది. 1922 ఫిబ్రవరిలో సవరల పోరాటం జరిగింది. అడవిలో గడ్డిని తెచ్చుకోవటానికి బ్రిటీష్ పాలకులు అడ్డంకులు కల్పించడంతో సవరలు తిరుగుబాటు చేశారు.

మన్యం పోరాటం

అల్లూరి సీతారామరాజు నడిపిన పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. అల్లూరి పోరాటం బ్రిటీష్‌వారిని గడగడలాడించింది. విద్యార్థి దశలోనే దోపిడీని రూపుమాపేందుకు అల్లూరి తనవంతు పోరాటం ప్రారంభించారు. 'ఎవడురా? నా భరతజాతిని కప్పమడిగిన దుష్టుడు' అంటూ బ్రిటీష్ అధికారులను ఎదిరించాడు. 1922 ఆగస్టు 22న తొలిసారిగా చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. ఆ మరునాడే రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌పైనా, ఆ మరునాడు అడ్డతీగెల, రంపచోడవరం పోలీస్‌స్టేషన్లపై దాడులు జరిపారు. ఈ పోరాటాన్ని అణచివేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వం నిరంకుశ సైనాధికారి రూథర్ ఫర్డ్‌ను ప్రత్యేకంగా రప్పించింది. అల్లూరి జాడకోసం గిరిజనులను అనేక విధాలుగా బ్రిటీష్ సైనికులు హింసించారు. 1924 మే 12న కొయ్యూరుకు సమీపంలో అల్లూరి బంధించి కాల్చిచంపారు.

స్వాతంత్రపోరాటంలో కమ్యూనిస్టు పార్టీ

1921లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునివ్వడంతో అప్పటివరకూ సాగిన స్వాతంత్రపోరాటం దిశ మారింది. సరిగ్గా అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో మహాత్మాగాంధీ శకం బలోపేతమైంది. భారతజాతిని ఒక్కతాటిపై నిలిపి, బ్రిటిష్‌వాడికి వ్యతిరేకంగా నిలపడంలో గాంధీ పోషించిన పాత్ర ఎంతో ఉన్నతమైనది. ప్రతి భారతీయుడినీ స్వాతంత్ర సమరోన్ముఖుల్ని చేయడం కోసం ఆయన దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ విస్తృతంగా పర్యటించారు. తన పర్యటనలో భాగంగా ఆయన విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాలను పర్యటించారు.

జాతీయోద్యమానికి బీజాలు

1920లో దేశంలో స్వాతంత్ర్య కాంక్ష బలీయమైంది. విశాఖ జిల్లా నుంచి ఎందరో యువకులు, మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. అదే సమయంలో గాంధీ విశాఖజిల్లాలో పర్యటించారు. గాంధీ ప్రసంగాలకు యువత స్ఫూర్తి పొంది పెద్దఎత్తున ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1921 మార్చి 31న విజయవాడలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకుగానూ గాంధీ కోల్‌కత్తా నుంచి మార్చి 27న మెయిల్‌లో బయల్దేరారు. మార్గమధ్యలో అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఆగి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. గాంధీజీ తిరిగి 1929 ఏప్రిల్ 28న విశాఖపట్నం మరోసారి వచ్చారు. భీమునిపట్నం, అనకాపల్లి, ఏటికొప్పాక, చోడవరం, కైలాసపట్నం, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో గాంధీ పర్యటించి ఖద్దరు నిధి వసూలు చేశారు. 1933లో మరోసారి గాంధీ విశాఖపట్నం వచ్చారు. అస్పృశ్యతా నివారణోద్యమంలో భాగంగా ఆయన ఈ దఫా పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దమొత్తంలో హరిజన ఫండ్ సమకూరింది. 1946లో గాంధీ మరోసారి విశాఖ జిల్లాలో పర్యటించారు. కళావెంకటరావు, తెన్నేటి విశ్వనాథం, ముళ్లపూడి పళ్లంరాజు, కొల్లూరి వీరభద్రరావు తదితరులతో కలిసి గాంధీ రైల్వే మైదానంలోని బహిరంగ సభకు కాలినడకన వెళ్లారు. అక్కడ జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ విశాఖ జిల్లాను నాలుగుసార్లు సందర్శించారు. ఇలా పర్యటించినప్పుడల్లా గాంధీకి విశాఖ ప్రజలు అండగా ఉన్నారు. గాంధీ స్ఫూర్తితో అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి వంటి ప్రాంతాల్లో పెద్దఎత్తున పోరాటాలు చేశారు.

ఉప్ప సత్యాగ్రహం

1930 ఏప్రిల్‌లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం జిల్లాలో మూడు విడతలుగా జరిగింది. ఈ బృందాలకు మారేపల్లి రామచంద్రశాస్త్రి, మల్లెమడుగుల జగన్నాథరావు, దిగుమర్తి జానకీబాయమ్మ నాయకత్వం వహించారు. ఒక బృందం అరెస్టయితే, మరో బృందం ఉప్పు సత్యాగ్రహం నిర్వహించేంది. 1930 ఏప్రిల్ 13న సాయంత్రం 4 గంటలకు నగరంలోని టౌన్‌హాల్ ఎదుట సముద్రంలో ఉప్పు వండారు. దీనికి ఐదు వేల మంది పాల్గొన్నారు.

1942 క్విట్ ఇండియా ఉద్యమం

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలోనూ విశాఖ జిల్లావాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనకాపల్లిలో కోరుకొండ బుచ్చిరాజు, కోరుకొండ సుబ్బరాజు, జిక్కినపల్లి శ్రీరామూర్తి తదితరులను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఉద్యమానికి ప్రజలను సమీకరించడంలో కమ్యూనిస్టు నాయకులు సిఆర్ వల్లభన్, మళ్ల నర్సింహమూర్తి, పెంటకోట శ్రీరాములు కీలకపాత్ర పోషించారు.

విశాఖలో.. ఉప్పు సత్యాగ్రహం

ప్రజాశక్తి – విశాఖపట్నం

ఆంగ్లేయుల పాలనలో తెల్లవాడిని ప్రశ్నించడమే పెద్ద సాహసం. అటువంటిది వాడిని ధిక్కరించడం ఇంకెంత సాహసమో అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అప్పట్లో బ్రిటిష్ పాలకులు ఉప్పు తయారీకి లైసెన్స్ ఫీజు వసూలు చేసేవారు. తమ ఉప్పు పరిశ్రమలను కాపాడుకోవడం కోసం దేశీయంగా ఉప్పు తయారీని నిరోధించాలన్నది ఇందులో ఎత్తుగడ. ఈ నిబంధన ఫలితంగా ఎవరైనా ఉప్పు తయారు చేసుకోవాలంటే అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాల్సి వచ్చేది. సముద్రపు నీటిని మరగకాచితే తయారయ్యే ఉప్పుపై ఈవిధమైన నిబంధన విధించడంపై ప్రజలు సహజంగానే అసంతృప్తికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మహాత్మాగాంధీ 1930లో ఉప్పు సత్యాగ్రహానికి పిలుపిచ్చారు. ఈ పిలుపు అందుకున్న సత్యాగ్రహులు చిన్న కుండలతో సముద్రపు నీరు తెచ్చి పొయ్యిలపై మరిగించి ఉప్పు తయారు చేసేవారు. ఆ సమయంలో పోలీసులు వచ్చి ఆ కుండలను లాఠీలతో పగలగొట్టేవారు. అడ్డుకున్న నాయకులకూ లాఠీదెబ్బలు తప్పేవి కావు. పోలీసుల రాక తెలుసుకున్న కొందరు వారికి దొరక్కుండా కుండలు పట్టుకుని బీచ్‌లో పరుగులు తీసేవారు. ఉప్పు సత్యాగ్రహానికి గాంధీ పిలుపు ఇచ్చిన సమయంలో అనకాపల్లిలో అప్పటి శివాజీ ఖద్దరు స్టోర్స్ మేడపై జిల్లా స్థాయి నాయకుల సమావేశం జరిగింది.



ఉప్పు సత్యాగ్రహ దీక్షలో మహాత్మాగాంధీ

యాధృచ్ఛికంగా అదే రోజు అనకాపల్లి నూకాలమ్మ జాతర కూడా. ఈ అవకాశాన్ని నాయకులు చక్కగా వినియోగించుకున్నారు. కొన్ని వేలమంది ప్రజల మధ్య ఉప్పు సత్యాగ్రహం గురించి, బ్రిటిష్‌వాడి విధానం గురించి ఉత్తేజపూరితంగా ప్రసంగించారు. మాడుగులవాసి భమిడిపాటి చినయజ్ఞనారాయణశర్మ, దిమిలి వాస్తవ్యుడు ఎం.వి.వి.సత్యనారాయణ, అనకాపల్లికి చెందిన గుడి పేర్రాజు తదితరులు ఉపన్యాసాలు ఇచ్చారు. అదే సమయంలో ఉప్పు సత్యాగ్రహం వ్యాప్తి కోసం కొండా వెంకటప్పయ్య పంతులుగారు విశాఖ వచ్చారు. ఆ సందర్భంగా టౌనుహాలు ఎదుట ఉన్న బీచ్‌లో మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు) అధ్యక్షతన సభ జరిగింది. భీమిలి, దిమిలి, విశాఖ తీరాల్లో ఎక్కడ ఉప్పు వండాలనేదానిపై కొంత మల్లగుల్లాలు పడ్డారు. చివరకు విశాఖ బీచ్‌నే కేంద్రంగా ఎంచుకున్నారు. 1930 ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉప్పు వండాలని నిర్ణయించారు. ఆ విషయాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ బ్రాకెన్‌కు లేఖ ద్వారా తెలిపారు. మొదట్లో బ్రిటిష్ అధికారులు ఇదేదో సాధారణ విషయంగా తీసుకున్నారు. అయితే, ఆ రోజు బీచ్‌లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో 5వేలమందికి పైగా పాల్గొన్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. ఆ సమయంలో పోలీసులు బీచ్‌లో లాఠీఛార్జీ చేశారు. అయినప్పటికీ సత్యాగ్రహులు ఉప్పు తయారుచేసి వేలం వేయగా రూ.3వేలు పైగా వచ్చింది. ఉప్పు సత్యాగ్రహాన్ని అడ్డుకుందుకుగానూ ఏప్రిల్ 17న బ్రిటిష్ ప్రభుత్వం మారేపల్లి రామచంద్రశాస్త్రి, తెన్నేటి విశ్వనాథం, దిగుమర్తి రామస్వామి, కె.ఎస్.గుప్తా, వి.బుచ్చిసుందరరావు, భమిడిపాటి చిన యజ్ఞ నారాయణశర్మ తదితరులను అరెస్టు చేసింది. దీనిని నిరసిస్తూ ఆ మర్నాడు విశాఖలో హర్తాళ్ చేశారు.

నాయకుల అరెస్టుతో ఉప్పు సత్యాగ్రహం వెనుకపట్టు పడుతుందని బ్రిటిష్ అధికారులు భావించారు. అయితే, వారి అంచనాలు తలకిందులయ్యాయి. పి.సీతారామచంద్రరాజు సారథ్యంలో సత్యాగ్రహులు ఉప్పు వండటానికి సిద్ధమయ్యారు. దీంతో, పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. ఈ దశలో ఉద్యమ స్థానం విశాఖ నుంచి ఎలమంచిలి సమీపంలోని దిమిలికి మారింది. 1930 మే 4న ప్రజలు విశాఖ నుంచి గుంపులు గుంపులుగా దిమిలి వెళ్లారు. ఇరవైకి పైగా పొయ్యిలు ఏర్పాటు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి మిస్సుల సత్యనారాయణ, యల్లాజీ నారాయణరావు, గుడి పేర్రాజు, ప్రయాగ సత్యనారాయణవంటి సత్యాగ్రహుల్ని అరెస్టు చేశారు. వారిని నర్సీపట్నం సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ డి.జి.బెల్ ముందు హాజరుపరిచి శిక్ష విధించారు. నాయకులు, ముఖ్య కార్యకర్తలు అరెస్ట్ కావడంతో వారి భార్యలు ఉద్యమంలోకి దూకారు. మారేపల్లి రామచంద్రశాస్త్రి భార్య శారదాంబ, దిగుమర్తి రామస్వామి భార్య జానకీబాయివంటివారు ఈవిధంగానే ఉద్యమం లోకి వచ్చారు.

అనంతరం, రంగం గాజువాక సమీపంలోని బాలచెరువుకు మారింది. అక్కడున్న ప్రభుత్వ ఉప్పు ఫ్యాక్టరీపై దాడిచేయాలని నిర్ణయించారు. నగరంలోని ప్రముఖ న్యాయవాది కందాళ సర్వేశ్వరశాస్త్రి నాయకత్వంలో మే 28న ఈ దాడి చేయాలని నిర్ణయించారు. దీనిని ముందుగా పసిగట్టిన బ్రిటిష్ పోలీసులు అక్కడికి చేరిన అనేకమందిని అరెస్టు చేసి లారీల్లో తరలించి కలెక్టరు ముందు హాజరుపరిచారు. అందులో మహిళలూ ఉన్నారు.

బి.బుచ్చి సీతారామచంద్రరాజు, కె.బుచ్చి రాజు తదితరులు అరెస్టయ్యారు. తరువాత ఈ దాడిని కొనసాగించబోయిన దిగుమర్తి జానకీబాయి కూడా అరెస్టయ్యారు. ఆ తరువాత అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరిగినా ఉప్పు సత్యాగ్రహం క్రమంగా బలహీనపడింది.

గాజువాక బరిలో మరోసారి పల్లా



ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజవర్గంలో పల్లా శ్రీనివాసరావు మరోసారి ఎమ్మెల్యే బరిలో నిలవనున్నారు. గాజువాకలో పల్లా శ్రీనివాసరావు అంటే ప్రతి ఒక్కరికీ తెలుసు. ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మృదు స్వభావం కలిగిన వ్యక్తి అని, వివాదాలకు దూరంగా ఉంటారని, చదువుకున్న వ్యక్తి కావడంవల్ల మంచి చేస్తారని భావన గాజువాక ప్రజల్లో నాటుకుపోయింది. 2014 సంవత్సరం ఎన్నికల్లో కూడా ఆ గుణాలే ఆయనకు గెలుపుకు దోహదపడ్డాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఈ గుణాలే ఆయన గెలుపునకు దోహదపడతాయని గాజువాక ప్రజల్లో చర్చ నడుస్తోంది. గతంలో ఎమ్మెల్యేగా ఉండి కూడా ఆయన సొంత బంధువులకు, సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇచ్చారనే అపవాదు లేకుండా ప్రజలందరికీ ప్రాధాన్యం ఇచ్చి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గాజువాక హౌస్ కమిటీ, మరిన్ని ఇతర సమస్యలను కూడా పరిష్కరించారు. పల్లా శ్రీనివాసరావు చాలా మంచి వ్యక్తి అని, రాజకీయాలు, కులమతాలకతీతంగా పనిచేశారని గాజువాక ప్రజలు చెబుతారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉంటే గాజువాక ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని ప్రజల్లో భావన నెలకొని ఉంది. ఎంటెక్, ఎంబిఎ చదువుకున్నారు. గాజువాకలో పుట్టి, పెరిగిన వ్యక్తి కావడం నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉండి, పరిష్కారానికి గతంలో కష్టపడిన సందర్భాలు ఉన్నాయి. అందుకే ఈసారి ఆయన వైపు గాజువాక ప్రజలు చూస్తున్నారు. ఆయన్ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని గాజువాక ప్రజలు ఎదురుచూస్తున్నారు. వివాదాలకు తావు లేకుండా ఆయన రాజకీయం ఉంటుందని కార్యకర్తల్లో భావన ఉంది. గతంలో చాలామంది పేదలకు హౌసింగ్ రుణాలు ఇచ్చి గృహాలు నిర్మించారని మంచి పేరు ఉంది. నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తీవ్ర కృషిచేశారు. నియోజకవర్గంలో ఆయనకంటూ ప్రత్యేకమైన కేడర్ ఉంది. ఈసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కార్యకర్తలు తహతహలాడుతున్నారు. జనసేన, టిడిపి పొత్తుల వల్ల పల్లాకు సీటు రాదని ప్రచారం జరుగుతోంది. గాజువాక సీటు పల్లాకే ఇవ్వాలని ఇప్పటికే అధిష్టానికి కార్యకర్తలు సంకేతాలు పంపారు. వైసిపి నుంచి ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ భయపడకుండా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని ప్రజల్లో మంచి భావన ఉంది. పల్లా శ్రీనివాసరావు క్రమశిక్షణ వల్లే ఆయన ఎక్కువ మద్దతు లభిస్తోంది.

ముచ్చన్నెల జెండా రూపకర్త పింగళి

ప్రజాశక్తి - విశాఖపట్నం

ముచ్చన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య 1878 ఆగస్టు 2వ తేదీన దివి తాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే కొనసాగింది. 12 సంవత్సరాలకే సెకండరీ విద్య పూర్తిచేసి 19 సంవత్సరాల ప్రాయంలోనే యుద్ధంలో చేరాలనే కోరికతో ముంబై వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడ గాంధీజీని కలవటం, స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుడు కావడంతో ఇండియాకు తిరిగి వచ్చారు. అప్పటికే మద్రాసులో ప్లేగు వ్యాధి ప్రబలి ఉండటంతో దేశ ప్రజలను ఆ వ్యాధి నుంచి కాపాడాలన్న తపనతో వ్యాధి నివారణ అధికారిగా పనిచేశారు. 1904లో రష్యాను జపాన్ గెలిచిందన్న వార్త విని వెంకయ్యలోని జిజ్ఞాస మేల్కొని ఇది ఎలా సంభవం, పెద్ద దేశాన్ని ఇంత చిన్నదేశం ఎలా జయించింది అనే తపనతో జపాన్ భాష నేర్చుకుని అనర్గళంగా మాట్లాడారు. జపాన్ వెంకయ్య అని పేరు పెట్టారు ప్రజలు. ఆయనకు ఆ భాష నేర్పిన గురువుకు మన భాషను నేర్పి గురు ఋణం తీర్చుకున్నారట వెంకయ్య, వారి పట్టుదల ఎంత దృఢమైనదో యువత గుర్తుంచుకోవాలి.

దేశభక్తిగల వెంకయ్య 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని నాటి సభాధ్యక్షులైన దాదాబాయి నౌరోజీ మన్ననలు పొంది నిర్ణయ సభ సభ్యునిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ఆసక్తితో పరిశోధనలు చేసి వ్యవసాయ శాస్త్రం అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. వారి మేధా సంపత్తి నుంచి మనం ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను రాజకీయ ద్రష్టగా అభివర్ణించారు పెద్దలు. 1906లో కోల్‌కొతాలో జరిగిన కాంగ్రెస్ సభల్లో ఇంగ్లీషు వారిని పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించటం నచ్చని వెంకయ్య మనకంటూ ఒక జెండా కావాలనే తపనతో భారతదేశ జాతీయ పతాకం అనే గ్రంథాన్ని 1916లో మనకు అందించారు. అప్పుడు వారిని జెండా వెంకయ్యగా పిలిచే వారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి జీవిత విశేషాలు ఎన్నో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.


1921 మార్చి 31, ఏప్రిల్ 1న బెజవాడలోని గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ మహాసభల్లో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో గాంధీజీ సమక్షంలో వెంకయ్య రూపొందించిన జెండాను ఏకగ్రీవంగా కరతాళ ధ్వనుల మధ్య ఆమోదించబడి మొదట రాట్నం ఉన్న, తర్వాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో మన జాతీయ జెండా కీర్తి అనే ఆకాశంలో విహరిస్తూ భారతదేశం మనది అనే స్ఫూర్తిని గర్వంగా చాటుతూ రెపరెపలాడుతోంది.











స్వాతంత్ర్యోద్యమంలో మహిళా శక్తి

విశాఖలో జానకీబాయమ్మ వీరోచిత పాత్ర
దిమిలి గ్రామం నాయకీమణులకు పుట్టినిల్లు

ప్రజాశక్తి -కలెక్టరేట్

స్వాతంత్ర్యోద్యమంలో విశాఖ జిల్లాకు చెందిన ఎందరో మహిళలు సమరశీల పాత్ర పోషించారు. బ్రిటీషు ముష్కర పాలనకు నిరసనగా దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన మహోద్యమంలో నిప్పుకణికలయ్యారు. వీరందరి పేర్లూ చరిత్రలో లిఖించబడక పోయినప్పటికీ స్వాతంత్ర్యోద్యమానికి వీరిచ్చిన తోడ్పాటు, మిలిటెన్సీ పోరాటాల్లో వీరు ప్రదర్శించిన తెగువ, ధైర్యసాహసాలూ... ఎంతో కీలకమైనవి. స్త్రీలు చదువుకోవడాన్ని సైతం అంగీకరించని ఆనాటి సమాజపు కట్టుబాట్లను ఛేదించి మరీ తెల్లదొరల పాలనను అంతమొందించేందుకు మన జిల్లా మహిళలు నడుం బిగించారు. పురుషులతో సమానంగా భుజంభుజం కలిపి పోరాటాలకు సిద్ధమయ్యారు. కన్నూమిన్నూ కానని బ్రిటీషు నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో గర్భిణులు సైతం ఆందోళనల్లో అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. కుటుంబాలకు దూరంగా, ఒంటరిగా జైలు జీవితాన్ని అనుభవించారు. కొంతమంది జైళ్లలోనే బిడ్డలకు జన్మనిచ్చారు. ఒకపక్క కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు దేశంకోసం జీవితాలను త్యాగం చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో ఎదురైన బ్రిటీషు నిర్బంధం, ఆటంకాలు వారిలోని దేశభక్తిని ఏమాత్రం చెదరగొట్టలేకపోయాయి.

ఆంధ్ర రాష్ట్రం మొత్తమ్మీద బ్రిటీషు ప్రభుత్వ నిర్బంధానికి గురై జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళ విశాఖపట్నానికి చెందిన దిగుమర్తి జానకీబాయమ్మ కావడం మన జిల్లాకు ఎంతో గర్వకారణం. దేశస్వాతంత్ర్య పోరాటంలో భాగంగా విశాఖ జిల్లాలో నడిచిన ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా తదితర ఉద్యమాల్లో జిల్లా మారుమూల ప్రాంతాల మహిళలు సైతం చురుకైన పాత్ర పోషించారు. కొన్ని ఉద్యమాలను మహిళలే ముందుపీఠిన ఉండి నడిపించారు. యలమంచిలి, అనకాపల్లి, విశాఖపట్నం, యలమంచిలి మండలంలోని దిమిలి, మాడుగుల తదితర ప్రాంతాల్లో మహిళా ఉద్యమాలు నడిచాయి. మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, వరకట్న వేధింపులు వంటి గృహ, సామాజిక హింసలు పెరుగుతున్న నేటి తరుణంలో ఆనాటి మహిళా ఉద్యమ గాథలను మననం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం.



విశాఖపట్నంలో జన్మించిన జానకీబాయమ్మ జిల్లా జాతీయోద్యమంలో నాయకత్వ పాత్ర పోషించింది. శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహం, రౌలత్ బిల్లుకు నిరసనగా నిర్వహించిన సత్యాగ్రహం తదితర అనేక ఉద్యమాల్లో తెగువ ప్రదర్శించింది. గర్భిణిగా ఉన్న సమయంలో సైతం ఆమె ప్రత్యక్ష పోరాటాలను నడపడానికి వెరవలేదు. చివరకు ఇలా ఉండగానే బ్రిటీషు నిర్బంధానికి గురై రాయవేలూరు జైలులో శిక్ష అనుభవించింది. జైల్లోనే ఆమె ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ బిడ్డ జైల్లోనే ఏడునెలలపాటు పెరిగింది.

విద్యార్థి దశ నుంచే బ్రిటీషు వ్యతిరేక ఉద్యమం పట్ల ఆకర్షితులైన జానకీబాయమ్మ జాతీయోద్యమంలో అడుగుపెట్టింది. విశాఖ క్వీన్‌మేరీ హైస్కూల్లో చదువుతుండగా దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమానికి, బందరులో జాతీయ కళాశాల స్థాపనకు విరాళాలు వసూలు చేసింది. 1915లో పెళ్లిచేసుకొని, అనంతరం జిల్లాలో ఆందోళనకు నాయకత్వం వహించింది. స్వాతంత్ర్యయోధులైన ఆమె భర్త దిగుమర్తి రామస్వామి పంతులు ఆమెకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఈమె 1920లో కాకినాడ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. జిల్లాలో ఉప్పు సత్యాగ్రహ శిబిరం ఈమె నాయకత్వంలోనే నడిచింది. ఆమె విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించిన ప్రచారయాత్రల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్యా నంతరం ఆమె విశాఖ పురపాలక సంఘ సభ్యు రాలిగా రెండుసార్లు ఎన్నికయ్యారు.

యలమంచిలికి చెందిన కాలనాథభట్ల మహాలక్ష్మమ్మ శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహోద్యమాల్లో చురుకైన పాత్ర పోషించింది. 1920లో చోటు చేసుకున్న ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆరునెలల కఠిన కారాగార శిక్ష అనుభవించింది. 1933లో శాసనోల్లంఘనలో ముందుపీఠిన నిలిచి మళ్లీ వెల్లూరు, కన్ననూరు జైళ్లలో శిక్ష అనుభవించింది. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని మరో మూడు మాసాలు జైలు పాలైంది. ఆమె 1967లో కన్నుమూసింది.

యలమంచిలికి చెందిన మిస్సుల లక్ష్మీ నరసమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించింది. గర్భిణిగా ఉన్న సమయంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని బ్రిటీషు నిర్బంధానికి గురైంది. నిండు గర్భిణి అయిన ఆమె అత్యంత కష్టతరమైన పరిస్థితుల్లో జైలు జీవితాన్ని అనుభవించింది. కన్ననూరు జైల్లో ఒక ఆడశిశువుకు జన్మనిచ్చింది. తిరిగి 1932 సెప్టెంబర్‌లో అరెస్టయి మరో నాలుగు నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళలో శిక్ష అనుభవించింది.

శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటీషు ప్రభుత్వం లింగమాంబకు రూ.200 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని చెల్లించగలిగిన స్థోమత ఉండి కూడా బ్రిటీషు పాలకుల ఎదుట తలవంచేందుకు లింగమాంబ సిద్ధపడలేదు. ఆరు నెలల జైలు జీవితాన్ని అనుభవించింది. యలమంచిలి మండలంలోని దిమిలి గ్రామానికి చెందిన ఈమె 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని మూడు నెలలు కారాగార శిక్షను అనుభవించింది. క్విట్ఇండియా ఉద్యమంలో ముందుపీఠిన నిలిచి మరో మూడు నెలల పాటు జైలు జీవితాన్ని గడిపింది. ఇదే గ్రామానికి చెందిన్ల సోదెమ్మ, లక్ష్మీనరసమ్మ, శ్యామసుందరమ్మ ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొన్నారు. 1940లో నిర్వహించిన వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నందుకు సోదెమ్మ మూడునెలల జైలు శిక్ష అనుభవించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లక్ష్మీనరసమ్మ వెల్లూరు జైల్లో మూడునెలల పాటు, శ్యామ సుందరమ్మ ఏడునెలల పాటు కారాగార శిక్ష అనుభవించారు.

అనకాపల్లికి చెందిన దర్భా వెంకట రమణమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఈ ప్రాంత మహిళలను కదిలించింది. ఇందుకోసం నాలుగు నెలలపాటు నెల్లూరు, వెల్లూరు జైళ్లలో శిక్ష అనుభవించింది. కొడుకుల కామేశ్వరమ్మ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడు మాసాలపాటు వెల్లూరు జైల్లో శిక్ష అనుభవించింది. దేశాయి 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో తెల్లదొరల నిర్బంధానికి గురైంది. విశాఖపట్నం వాసి గుండుమల్ల రంగనాయకమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఆరు మాసాల జైలుశిక్ష అనుభవించింది.

స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన అందరి మహిళల పేర్లూ చరిత్రకెక్కక పోయినప్పటికీ జిల్లాలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల బ్రిటీషు వ్యతిరేక పోరాటంలో స్త్రీల పాత్ర అద్వితీయమైనది. మన్నెంలో అల్లూరి సీతారామరాజు నడిపిన బ్రిటీషు వ్యతిరేక పోరాటానికి గిరిజన మహిళలు అనూహ్యమైన సహాయ సహకారాలు అందించారు. రహస్యజీవితం గడుపుతున్న ఉద్యమకారులకు ఆహారాన్ని సమకూర్చి, వారి బట్టలు ఉతకడం తదితర పనులను చేయడం ద్వారా సహకరించారు.

ఎన్ని ఒత్తిడులొచ్చినా, శారీరక, మానసిక హింసలు ఎదురైనా ఉద్యమ రహస్యాలను కడుపులో పెట్టుకొని స్ఫూర్తిదాయకంగా నిలిచారు. నేడు దేశంలో అసమానతలు పెచ్చుమీరుతూ, సామాన్యుల బతుకులు ఛిద్రమవుతున్న తరుణంలో నాడు తెల్లదొరలను తరిమికొట్టిన ఉద్యమ గాథలను మననం చేసుకోవడం, ఆ స్ఫూర్తితో ఉద్యమించడం అత్యంత ఆవశ్యకం.

'నవశక్తి' మంతుడు మద్దూరి

విశాఖపట్నం : తెలుగునాట నవశక్తిమంతునిగా మద్దూరి అన్నపూర్ణయ్య పేరుగాంచారు. ఆనాడు తొలుత 'కాంగ్రెస్' అనే పేరుతో వారపత్రికను ప్రచురించారు. జైలుశిక్షనూ అనుభవించారు. ఆ తరువాత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరిన అనంతరం 'నవశక్తి' పేరుతో డిక్లరేషన్ తీసుకుని మరో పత్రికను ప్రచురించారు. ఈ పత్రిక 1937లో తన తొలి సంచిక ముఖపత్రంలో కారల్‌మార్క్స్ చిత్రాన్ని ప్రచురించడం విశేషం. నవశక్తి పత్రికను ప్రచురించడానికి తనకు పిత్రార్జితంగా వచ్చిన రెండెకరాల ఆస్తిని అమ్మి దీనిని నడిపారు. భావజాలంలో అది తొలి కమ్యూనిస్టు పత్రికగా పరిగణించబడింది.

కమ్యూనిస్టు పత్రికలకు వెన్నెముక బొమ్మారెడ్డి



ప్రజాశక్తి - విశాఖపట్నం

అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు.' ప్రజాశక్తి ' దినపత్రిక తెలుగు పత్రికా రంగంలో గుర్తింపు తెచ్చుకుని నేడు ఇంతటి సమున్నత స్థితికి చేరుకుని 43వ వసంతంలోకి అడుగు పెట్టిందంటే ఇందులో బొమ్మారెడ్డి కృషి, త్యాగం మరువలేనిది. బొమ్మారెడ్డి పలు పుస్తకాలు, అనువాద రచనలు చేశారు. ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అన్ని పత్రికల్లోనూ పనిచేసిన ఘనత ప్రజాశక్తి'మంతుడు' బొమ్మారెడ్డికే దక్కింది.

1917లో కృష్ణాజిల్లా తేలప్రోలు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. 2006 అక్టోబరు 13న కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ఆ ముగ్గురికి ఆయన కోరుకున్న పద్ధతిలోనే సంస్కరణ వివాహం జరిపించారు. తొమ్మిది పదుల నిండైన జీవితంలో అయిదు పదులు కమ్యూనిస్టు పత్రికా సంపాదకునిగా ప్రస్థానం సాగించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రజాశక్తి రావడంతో అందులో సబ్ ఎడిటర్‌గా చేరారు. కొన్నాళ్లకే పత్రికను ప్రభుత్వం నిషేధించినా బొమ్మారెడ్డి పత్రికా రంగాన్ని విడనాడలేదు. ఆనాటి 'ఆనంద వాణి' పత్రికకు వ్యాసాలు రాస్తుండేవారు. కమ్యూనిస్టు నాయకులందరూ అజ్ఞాత వాసంలోకి వెళ్లగా బొమ్మారెడ్డి మాత్రం గన్నవరం తాలూకా కపిలేశ్వరపురం వద్ద రహస్యంగా రాజకీయ తరగతులు నిర్వహిస్తుండేవారు. అప్పట్లో 'జనత' పత్రికను ఉపయోగించుకోవలసిందిగా గంగినేని వెంకటేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి కబురంపారు. 'జనత' పత్రికను కమ్యూనిస్టు పార్టీ తీసుకుని బొమ్మారెడ్డి, మా భూమి నాటక కర్త వాసిరెడ్డి భాస్కరరావును సంపాదక వర్గంగా నిర్వహించాడు. ఆలోగా విజయవాడలో పార్టీ నాయకులపై నిర్బంధం ముమ్మరం కావడంతో పత్రికను మూసేసి బొమ్మారెడ్డిని మద్రాసు వెళ్ళమని పార్టీ ఆదేశించింది. మద్రాసులో కమ్యూనిస్టు పార్టీ ఒక లా విద్యార్థి పేరుతో 'సందేశం' అనే వార పత్రికను నడిపింది. బొమ్మారెడ్డి ఆ పత్రికలో కొద్దికాలం పనిచేశారు. ఇంతలో తాపీ ధర్మారావు గారి 'జనవాణి'లో చేరవలసిందిగా పార్టీ ఆదేశించింది. దాంతో బొమ్మారెడ్డి తాపీధర్మారావు కుమారుడు మోహనరావుతో కలిసి ఆ పత్రికలో పనిచేశాడు.

మద్రాసులో బొమ్మారెడ్డి లాంటి కమ్యూనిస్టుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉండేది. ఆంధ్రలో పార్టీమీద ప్రభుత్వ నిఘా ఎక్కువ కావడంతో నాయకులు మద్రాసుకొచ్చి తలదాచుకునేవారు. వారికి వసతి ఏర్పాట్లు చేసే బాధ్యత బొమ్మారెడ్డి లాంటి యువకులపై ఉండేది. ఎప్పుడు పోలీసులు కన్ను తమపై పడుతుందోననే వాతావరణంలో నాయకులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. ఇంతలో తెలంగాణా పోరాటం ముగిసి ఆంధ్రలోకి తిరిగి వచ్చి పని చేయడానికి అనువైన పరిస్థితులేర్పడడంతో బొమ్మారెడ్డి విజయవాడ చేరుకుని 'ప్రజాశక్తి' వారపత్రికలో పనిచేయడం ప్రారంభించారు. విశాలాంధ్ర సంపాదకవర్గంలో చేరి పన్నెండేళ్లపాటు అంటే పార్టీలో చీలిక వచ్చేవరకు అందులో పనిచేశారు. చీలిక తరువాత సిపిఐ(ఎం) తరపున 'జనశక్తి' వార పత్రిక నిర్వహించబడుతుండేది. అప్పట్లో 'జనశక్తి' ఎడిటర్‌ను అరెస్టు చేయడంతో పత్రికా నిర్వహణ బాధ్యతను బొమ్మారెడ్డికి పార్టీ అప్పగించింది. నాయకులు విడుదలైన తరువాత 'జనశక్తి' దినపత్రికగా మారినా కొన్నాళ్లకు అది మార్క్సిస్టు లెనినిస్టుల చేతికిపోయింది. ఆ తరువాత 'ప్రజాశక్తి' వారపత్రికగా మొదట కొంత కాలం నడిచి తరువాత ద్వైవార పత్రికగా, అటుపిమ్మట దినపత్రికగా మారింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు.' ప్రజాశక్తి ' దినపత్రిక తెలుగు పత్రికా రంగంలో గుర్తింపు తెచ్చుకుని నేడు ఇంతటి సమున్నత స్థితికి చేరుకుని 43వ వసంతంలోకి అడుగిడిందంటే ఇందులో బొమ్మారెడ్డి కృషి, త్యాగం మరువలేనిది. బొమ్మారెడ్డి పలు పుస్తకాలు, అనువాద రచనలు చేశారు. ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అన్ని పత్రికల్లోనూ పనిచేసిన ఘనత ప్రజాశక్తి'మంతుడు' మన బొమ్మారెడ్డికే దక్కింది.

మహోద్యమంలో విశాఖ ప్రముఖులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

దేశ స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టంగా సాగింది. ఇందులో విశాఖ జిల్లా ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాట పటిమను ప్రదర్శించారు. బొంబాయి జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకులు పిలుపునిచ్చారు. అక్కడి నుంచి రాగానే, తెన్నేటి విశ్వనాథాన్ని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై ప్రజానీకం ఉవ్వెత్తున ఎగసింది. ఉపన్యాసాలతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారనే నెపంతో ఎలమంచిలిలో ఎంవివి.సత్యనారాయణ, శివ కామేశ్వరరావు, అనకాపల్లిలో కదిరిశెట్టి సుబ్బారావు, కోరుకొండ సుబ్బరాజు, జక్కిపల్లి శ్రీరామ్మూర్తి, విశాఖలో గోకా తమ్మనాయుడు, గెడ్డం సన్యాసిరావు, భీమిలిలో ఎం.వీరభద్రరావు తదితరులను ప్రభుత్వం అరెస్టు చేసింది.

దీనిపై ఆగ్రహించిన ప్రజలు రైల్వే, టెలిగ్రాఫ్, పోస్టాఫీసులు వంటి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. నక్కపల్లిలో టెలిగ్రాఫ్ వైర్లు తొలగించిన అభియోగంపై పాయకరావుపేట నివాసి రంగనాథాచారిని, అతడి మిత్రులను అరెస్టు చేశారు. కార్యకర్తలపై దమనకాండకు నిరసనగా ఆంధ్ర వైద్య కళాశాల, ఎవిఎన్ కళాశాల, అనకాపల్లి మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులు తరగతుల్ని బహిష్కరించారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అనకాపల్లిలో కోరుకొండ బుచ్చిరాజు, కోరుకొండ సుబ్బరాజు, జిక్కినపల్లి శ్రీరామ్మూర్తి తదితరులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. వారు ఆలీపూరు జైలులో శిక్ష అనుభవించారు. ఈ సందర్భంగా ఇంకా మరింతమంది అరెస్టయ్యారు. కమ్యూనిస్టు నాయకులు మణి (సిఆర్ వల్లభన్), మళ్ల నరసింహమూర్తి, పెంటకోట శ్రీరాములు ఆ కాలంలో ప్రజల్ని సమీకరించడంలో కీలకపాత్ర పోషించారు.

అరెస్టులను, నిర్బంధాలను అధిగమించి ఉద్యమ విస్తరణకు కృషి చేశారు. మహాత్మాగాంధీ ఉపవాసదీక్ష పూనితే, ఆయనకు మద్దతుగా 1943 ఫిబ్రవరి 18న ఎవిఎన్ కళాశాల, ఆంధ్ర వైద్య కళాశాలల్లోని వుమెన్స్ హాస్టళ్లలో విద్యార్థినులు కూడా ఉపవాసం చేశారు. ఈ విధంగా స్వాతంత్ర్యోద్యమ అన్ని ఘట్టాల్లోనూ విశాఖ జిల్లా ప్రజలు అపూర్వ చైతన్యం ప్రదర్శించారు.

ఆలయాల శిల్పకళా నైపుణ్యం అదరహో..


ప్రజాశక్తి - విశాఖపట్నం

తూర్పు కనుమల పాదాల చెంతనున్న ఉత్తరాంధ్రలో అనేక దేవాలయాలు శిల్పకళా నైపుణ్యంతో అబ్బురపరుస్తున్నాయి. నిత్య సందర్శనా స్థలాలుగా అలరారుతున్నాయి. మరికొన్ని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలుగాను విలసిల్లుతున్నాయి. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఇలాంటివి కోకొల్లలు.. అందులో కొన్ని రాష్ట్ర వ్యాప్త గుర్తింపు పొందినవీ ఉన్నాయి. సింహాచలం, రామతీర్థాలు, అరసవిల్లి, అనంత పద్మనాభుని ఆలయం, బొజ్జన్న కొండ.. ఇలా పదుల సంఖ్యలో ఉన్న ఈ సందర్శనా స్థలాలు ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉన్నాయి. అవన్నీ ఆనాటి శిల్పకళా వైభవానికి చిహ్నాలుగా నిలుస్తున్నాయి. వాటి విశిష్టతను తెలియజేసేదే ఈ కథనం.

సింహాచలం కొండపై అప్పన్న

విశాఖ నగర పరిధిలోని సముద్ర మట్టానికి సుమారు 800 అడుగులు ఎత్తున సింహగిరిపై లక్ష్మీనృసింహస్వామి దేవాలయం కొలువుతీరింది. తొలి దేవాలయాన్ని ప్రహ్లాదుడు నిర్మించినట్లు కథనం ఉంది. అయితే తదనంతర కాలంలో విజయనగరం సంస్థానాధీశులు సింహాచలం దేవస్థానాన్ని అభివృద్ధి చేశారు. వరహాలక్ష్మీ నరసింహా స్వామిని వ్యవహారికంగా సింహాద్రి అప్పన్న అని పిలుస్తారు. అప్పన్న దేవాలయ యాత్రకు వచ్చే భక్తుల్లో ఒడిశా రాష్ట్రం, ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు తమ పశు సంపదలో ఒక దూడను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆలయంలో ఏడాది పొడువునా అప్పన్న స్వామిని చందనంతో కప్పి ఉంచుతారు. ఏడాదిలో మాఘమాసంలో ఒక్క రోజే చందనం ఒలిచి చూపిస్తారు. ఆ రోజు మాత్రమే అప్పన్న నిజరూప దర్శనం కలుగుతుంది.

అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో అప్పన్న దేవాలయం 6వ శతాబ్దం నుంచి ఆధ్యాత్మిక సుగంధాలు వెదజల్లుతోంది. కల్యాణ మండపంలోని శిల్పకళా సౌందర్యం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఒక్కో స్తంభంపై ఒక్కో రకమైన శిల్ప సౌందర్యం కనులవిందు చేస్తుంది. ఒక స్తంభంపై ఉన్న కళాకృతులు మరో స్తంభంపై కనిపించవు. నాగబంధాన్ని తెలిపే కళాకృతులు వింతగొలిపేలా ఉంటాయి.



సింహాద్రి అప్పన్న ఆలయం

దేశంలో రెండో అనంత పద్మనాభుడు

ఆధ్యాత్మిక ప్రాశస్త్యం, చారిత్రక నేపథ్యం కలిగిన గ్రామం పద్మనాభం. అనంత పద్మనాభుడు సాలగ్రామ శిలపై స్వయంభువుగా వెలసిన ఆధ్యాత్మిక కేంద్రం. విశాఖ జిల్లాలోని మండల కేంద్రంగా ఉన్న పద్మనాభంలోనే పాండవుల ఉనికిని తెలిపే అనంత పద్మనాభుడు, కుంతీ మాధవ స్వామి ఆలయాలతో ఈ ప్రాంతం ప్రాచుర్యం పొందింది. అనంత పద్మనాభుని ప్రాచీన ఆలయాలు దేశంలో రెండు చోట్ల మాత్రమే ఉన్నాయి. ఒకటి కేరళలోని త్రివేంద్రంలో, మరొకటి ఉత్తరాంధ్రలోని పద్మనాభంలోనూ ఉన్నా యి. మహా భారతంలోని ప్రముఖ ఘట్టమైన అజ్ఞాతవాస ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుందీ క్షేత్రం. అరణ్యావాసం పూర్తైన తర్వాత అజ్ఞాతవాసంలోకి వచ్చిన పాండవులు ఈ కొండపైకి వచ్చి అనంతుని వ్రతం చేపట్టినట్లు ప్రచారంలో ఉంది. కుంతీదేవి తీర్థయాత్రలు చేసే సమయంలో పద్మనాభంలో మాధవస్వామిని ప్రతిష్ఠించడం వల్లే కుంతీ మాధవస్వామి ఆలయంగా ప్రాచుర్యం పొందిందని అంటారు. 11వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం ఆపారమైన ఆస్తులను కలిగి ఉంది. విజయనగర సంస్థానాధీశులు 3514 ఎకరాల భూములు ఇవ్వగా, వీటిలో బంజర్లు, పోరంబోకు ప్రభుత్వానికి చెందినవి. సుమారు 2500 ఎకరాలు సాగుభూములు దేవాలయం పేరునే ఉన్నాయి. ఆలయంపైకి ఫూట్ రోడ్డు నిర్మించారు. కొండపైన సందర్శకులకు మంచినీటి వసతి కల్పించారు.

నూకాంబిక

ఉత్తరాంధ్రుల కొంగుబంగారంగా అనకాపల్లి నూకాంబిక ప్రాచుర్యం పొందింది. అనకాపల్లి పాలకుడు కాకర్లపూడి అప్పలరాజు కాకతాంబ దేవాలయాన్ని నిర్మించాడు. అనంతరం భారతదేశంలో వలస పాలన కొనసాగించిన బ్రిటిష్‌వారు ఈ ప్రాంతాన్ని విజయనగర రాజులకు అప్పగించారు. కాలక్రమంలో కాకతాంబను విజయనగర రాజులు నూకాంబికగా పేరు మార్చి కొలిచేవారని ప్రచారం. విజయనగరం రాజులు అనంతరం గోడే వంశీయులు అనకాపల్లికి పాలకులు అయ్యారు. వారి తర్వాత చెముడు సంస్థానాదీశులు ఆలయం పరిపాలన బాధ్యతలు చేపట్టారు. చెముడు (కురుపాం జమిందారులు) సంస్థానాధీశులైన వైరిశర్ల వంశీయులే ఈ ఆలయానికి శాశ్వత ధర్మ కర్తలుగా ఉ న్నారు.

నాటి బుద్ధిని కొండ.. నేటి బొజ్జన్న కొండ

ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాంతాలలో భౌద్ధ క్షేత్రాలది ప్రత్యేక స్థానం. క్రీస్తుకు పూర్వమే బౌద్ధం ఈ నేలపై విస్తరించింది. బుద్ధుడి బోధనల వెలుగులు ఇక్కడ ప్రసరించాయి. తెలుగు నేల బౌద్ధాన్ని స్వాగతించింది. అక్కున చేర్చుకుంది. ఫలితంగా ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలు తెలుగు నేలపై అందునా విశాఖ జిల్లాలో ఏర్పడ్డాయి. అలాంటి వాటిలో అనకాపల్లికి సమీపంలోని బొజ్జన్న కొండ, భీమిలి సమీపంలోని తొట్ల కొండ ఉన్నాయి. బొజ్జన్న కొండ వద్ద ఏటా సంక్రాంత్రి మరుచటి రోజు కనుమ రోజు పెద్ద ఎత్తున ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవానికి అనకాపల్లి చుట్టుపక్కల ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారు. ఇక్కడ రెండు వేల సంవత్సరాల నాటి బౌద్ధ ఔన్నత్యాన్ని చాటి చెప్పే శిల్పాలను గత వైభవ చిహ్నాలుగా చూడొచ్చు. 1906 లో అలెగ్జాండర్ రిమ్ ఆధ్వర్యంలో చేపట్టిన పురావస్తు తవ్వకాలలో ఆనాటి రాజ శాసనాలు, ముద్రలు, నాణాలు, బౌద్ధ శిథిలాలు బయటపడ్డాయి. బంగారు నాణాలు సముద్రగుప్తుని కాలం నాటివని చెబుతారు.



బొజ్జన్న కొండ

సినీ వినీలాకాశంలో విశాఖ



విశాఖలో చిత్రీకరణ జరుపుకున్న సినిమాల్లో కొన్ని..

ప్రజాశక్తి - భీమునిపట్నం, కలెక్టరేట్

నీలి సంద్రం సోయగాలు.. ఎత్తయిన ఇసుక తిన్నెల వయ్యారాలు... చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచే బౌద్ధారామాలు, పురాతన కట్టడాలు... ప్రకృతి అందాలు ఎర్రమట్టి దిబ్బలు.. ఇలా ఎన్నెన్నో అందాలు విశాఖ తీరంలో కనువిందు చేస్తూ సినీరంగాన్ని ఆకట్టుకున్నాయి. ఇక్కడ తీసిన పది సినిమాల్లో కనీసం ఎనిమిది సినిమాలకు హిట్‌టాక్ వస్తోంది. అక్కినేని నటించిన కులగోత్రాలు, చిరంజీవి ఆరాధన, నాగర్జున శివమణి, కమలహాసన్ మరో చరిత్ర, జూనియర్ ఎన్టీఆర్ 'స్టూడెంట్ నెంబర్ వన్', బాలకృష్ణ లెజెండ్.. ఇలా ఎన్నో సినిమాలు ఇక్కడే రంగులద్దుకుని విజయవంతమయ్యాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రాంతానికి చెందిన ఎందరో కళాకారులు, దర్శకులు, సంగీత దర్శకులు, మాటల రచయితలు సినీ రంగంలో ప్రవేశించి రాణించారు.

చిత్ర పరిశ్రమలో ఓ వెలుగు వెలిగిన ఎందరో కళాకారులకు విశాఖ జిల్లాతో వారికి అవినాభావ సంబంధముంది. వీధినాటికలు, చిన్న, చిన్న పాత్రలు వేస్తూ చిత్రపరిశ్రమలో రాణించి ఆగ్రస్థానాల్లో నిలిచారు. నటన, దర్శకత్వం, మాటలు, పాటలు.. ఇలా అన్ని రంగాల్లోనూ రాణించి విశాఖకు వన్నె తెచ్చారు. తాపీ ధర్మారావు, శ్రీశ్రీ, ఆరుద్ర, రాజశ్రీ చిత్రరంగంలో తమ ప్రాభవాన్ని చాటుకున్నారు. 'పుణ్యభూమి నాదేశం నమోనమామి' అంటూ రాసిన జాలాది ఈ ప్రాంతానికి చెందినవారే. సినీ పాటల రచయిత సిరివెన్నల సీతారామశాస్త్రి, లేడీస్ టైలర్ చిత్రంలో బట్టల సత్తిగా నటించిన పీలా మల్లికార్జునరావు అనకాపల్లికి చెందినవారు. రెవెన్యూ విభాగంలో ఉన్నత పదవి నిర్వహిస్తూ నాటక రంగంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకుని తదనంతరం సినీ రంగంలో రాణించిన జొన్నలగడ్డ వెంకట సోమయాజులు, ఆయన సోదరుడు జెవి.రమణమూర్తి ఇక్కడివారే. సమరసింహారెడ్డి సినిమా నిర్మాత చెంగల వెంకటరావు, దొరబాబు చిత్ర నిర్మాత ఐవి.మోహన్ కూడా ఈ జిల్లాకు చెందిన వారే. పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే కాకర నూకరాజు 'పిల్లలు కాదు పిడుగులు' సినిమాలో నటించారు. అయితే ఈ సినిమా విడుదలకు నోచుకోలేదు. గజల్ శ్రీనివాస్ జిల్లాకు చెందినవారు కావడం విశేషం. మాటల రచయిత కులశేఖర్ సింహాచలం ప్రాంతానికి చెందినవారు. ఆకాశవాణి విశాఖ కేంద్రంలో పనిచేసిన ప్రముఖ రచయిత గొల్లపూడి మారుతీరావు సినిమాలకు మాటలు రాశారు. అనంతరం నటుడుగా రాణించారు. బాలీవుడ్ నటి వహీదా రహమాన్, తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో నటించి రాణించిన హీరోయిన్ గౌతమి విశాఖకు చెందినవారే. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా రూపొందిన సుందరకాండ హీరోయిన్ అపర్ణ, కె.విశ్వనాథ్ స్వరాభిషేకంలో నటించిన అముక్తమాల్యద ఇక్కడి వారే. ఆ రోజే, టార్గెట్, నిన్న నేడు రేపు, వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన సౌమ్య నగరంలోని పందిమెట్ట ప్రాంతానికి చెందినవారు. 'వయ్యారి భామ నీ హంస నడక' పాటకు బాణీలిచ్చిన రమణ గోగుల విశాఖ నగరానికి చెందిన వారే. మంచి కాఫీలాంటి సినిమా 'ఆనంద్' హీరో రాజా అక్కయ్యపాలెంలో ఉండేవారు. విశాఖ పోర్టులో గుమస్తాగా పనిచేసిన ముళ్లపూడి వెంకటరమణ, టెలిగ్రాఫ్ కార్యాలయంలో పనిచేసిన గణేష్‌పాత్రో, కాశీ విశ్వనాథ్, నంది అవార్డు గ్రహీత కళ్లు చిదంబరం, ప్రముఖ హాస్య నటుడు కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు (సుత్తివేలు), శుభలేక సుధాకర్, డాక్టర్ తంబు, ప్రసన్నకుమార్, మిశ్రో, కృష్ణచైతన్య, వైజాగ్ ప్రసాద్, (మిగతా 11లో..)




శ్రీశ్రీ



కళ్లు చిదంబరం



గొల్లపూడి



సినిమా షూటింగ్‌లకు ప్రసిద్ధిగాంచిన ఎర్రమట్టి దిబ్బలు

సినీ వినీలాకాశంలో విశాఖి

(11వ పేజీ తరువాయి..) యువ హీరో రాజ్‌ణ్, ఇలా అనేకమంది ఈ ప్రాంతానికి చెందినవారే కావడం విశేషం.

గ్రామీణ ప్రాంతం నర్సీపట్నంకు చెందిన గుణశేఖర్ టాలీవుడ్‌లో అగ్రదర్శకుల్లో ఒక్కరుగా నిలిచారు. మురారీ నుండి శాకుంతలం వరకు ఎన్నో సినిమాలను తీసి టాలీవుట్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. నర్సీపట్నం నుంచి వచ్చిన మరో అగ్రదర్శకుడు పూరి జగన్నాథ్. నర్సీపట్నంకు సమీపంలో ఉన్న కోటవురట్ల మండలం బాపిరాజుకొత్తపల్లి గ్రామానికి చెందిన ఆయన మొదట్లో హైదరాబాద్ వెళ్లి రామ్‌గోపాల్‌వర్మ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. 2000లో పవన్‌కళ్యాణ్‌తో తీసిన బద్రీ ఆఖండ విజయం సాధించింది. తరువాత ఎన్నో ఎన్నో హిట్ సినిమాలు అందించారు. మరో యువ దర్శకుడు పరశురామ్‌ది నర్సీపట్నం సమీపంలోని చెర్లోపాలెం గ్రామం. పూరీజగన్నాథ్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసి 2008లో నిఖిల్ హీరోగా యువత అనే సినిమాతో దర్శకుడిగా సత్తా చాటారు. తరువాత ఆంజనేయులు, సోలో, గీత గోవిందం వంటి హిట్ చిత్రాలకు సినిమా దర్శకత్వం వహించారు. పూరీ జగన్నాథ్ సోదరుడు సాయిరామ్‌శంకర్, పూరీ తనయుడు సినిమా హీరోలుగా స్థిర పడ్డారు. జోగి బ్రదర్‌లో ఒక్కరైన జోగినాయుడు, పద్మిని, లక్ష్మిశ్రీ, సైరాభాను, అమ్మనా కోడలు సీరియల్‌లో చైల్డ్ ఆర్టిస్ట్ విష్ణుప్రియ కూడా నర్సీపట్నంకు చెందిన వారే.

సినీ పరిశ్రమకు అనుకూలం విశాఖ

విశాఖ సినీ పరిశ్రమకు అనుకూలంగా ఉంటుంది. అందుకే ముందుచూపుతో రామానాయుడు ఇక్కడ స్టూడియో నిర్మించారు. ఇప్పటికే ఈ స్టూడియాలో అనేక సినిమాలు చిత్రీకరించారు. మరింత అభివృద్ధి చేస్తే సినీ హబ్‌గా రూపాంతరం చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నగరంలోని ఆర్కేబీచ్, రుషికొండ, భీమిలి పరిధిలోని తొట్లకొండ, మంగమారిపేట, చేపలుప్పాడ, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి, అన్నవరం బీచ్‌లు సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా ఉన్నాయి. గాజువాక, పరవాడ నియోజకవర్గాల్లోని గంగవరం, అప్పికొండ, యారాడ, ముత్యాలమ్మ పాలెం బీచ్‌లలో నీరు స్వచ్ఛంగా ఉంటుంది. ఇక్కడ తెల్లగా మెత్తగా ఉండే ఇసుక బ్యాంకాక్, సింగపూర్ తీరాలను తలపిస్తుంది. గోవా, విదేశాల్లో బీచ్‌లను తలపించేలా రుషికొండ తీరం ఉంటుంది. ఈ తీరంలోని ఇసుకతిన్నెలు, సముద్ర రాళ్ల గుట్టలు, నీలిసుడుల అలలు, సువిశాల తీరం ఎంతో ఆకట్టుకుంటాయి. రుషికొండలో ఎపి టూరిజం హరిత కాటేజీలు, గదులు ఉన్నాయి. ఇలాంటి దృశ్యాలన్నీ మనకు థాయ్‌లాండ్, జపాన్, బ్యాంకాక్, సింగపూర్ బీచ్‌లను గుర్తుకు తెస్తుంటాయి. బీచ్‌రోడ్డులో ఉన్న ఎర్రని ఎత్తయిన దిబ్బలు, జీడి, సరుగుడు వనాలతో అడవిలా ఉండే ఎర్రమట్టి దిబ్బలు చూసేందుకు రెండు కళ్లూ చాలవు. బాలకృష్ణ నటించిన నిప్పురవ్వ, లారీడ్రైవర్, సమరసింహారెడ్డి, సీమసింహం, జూనియర్ ఎన్టీఆర్ నటించిన బాల రామాయణం, సింహాద్రి, ఆంధ్రావాలా చిత్రాల షూటింగ్‌లు ఎర్రమట్టి దిబ్బల్లోనే జరిగాయి. సూపర్‌స్టార్ కృష్ణ అడవి సింహాలు చిత్రీకరణ ఎక్కువగా ఎర్రమట్టి దిబ్బల్లోనే చేశారు. అందాల నటుడు శోభన్‌బాబు గోరింటాకు, సర్పయాగం చిత్రాలు ఇక్కడే చిత్రీకరించారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన ఆరాధన, అభిలాష వంటి సూపర్‌హిట్ చిత్రాల షూటింగ్‌లు భీమిలి పరిసరాల్లో జరిగాయి. తూర్పు తీరంలోని ప్రధాన సహజ ఓడరేవు పట్టణమైన విశాఖకు టాలీవుడ్ వస్తే ఈ నగరం కూడా చెన్నయ్, ముంబయి, లాస్ ఏంజిల్స్ (హాలీవుడ్)లా అద్భుత సినీ పరిశ్రమ కేంద్రంగా రూపుదిద్దుకోనుందని సినీరంగ నిపుణులు పేర్కొంటున్నారు. మన్యంలోని అరకు అందాలు చెప్పనవసరం లేదు. నరసింహానాయుడు, మనసంతా నువ్వే, నువ్వు వస్తానంటే నేనొద్దంటానా ఇలా ఎన్నో సినిమాలు ఇక్కడ తీసినవే.

విశాఖలో తొలి సినిమా 'కులగోత్రాలు'

భీమిలిలో తొలినాళ్లలోనే సినీ షూటింగ్‌లకు బీజం పడింది. 1962లో అక్కినేని, కృష్ణకుమారి నటించిన కులగోత్రాలతో షూటింగ్‌లు ప్రారంభమై ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పలు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ, బెంగాలీ, ఒడిశా, ఇతర భాషా చిత్రాల్లో విశాఖ అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి సౌమ్యగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కొండపై కులగోత్రాల్లోని పెళ్లి దృశ్యాన్ని దర్శకుడు కె.ప్రత్యగాత్మ తెరకెక్కించారు. అప్పట్లో రోడ్డు సౌకర్యం లేక అప్పుడప్పుడూ మాత్రమే షూటింగ్‌లు జరిగేవి. అయితే 1972లో విశాఖ–భీమిలి మధ్య బీచ్‌రోడ్డు నిర్మాణం కావడంతో భీమిలి అందాలు వెండి తెరపై తళుక్కున మెరవడం మొదలయ్యింది. భారతీయ సినిమా చరిత్రలో ఎవర్ గ్రీన్‌గా నిలిచే ప్రేమ కావ్యం 'మరో చరిత్ర'ను 1978లో ప్రఖ్యాత దర్శకుడు, దాదాసాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత కె.బాలచందర్ భీమిలి–విశాఖ బీచ్‌రోడ్డు ప్రాంతాల్లోనే చిత్రీకరించారు. దీంతో మద్రాసు, హైదరాబాద్ తర్వాత షూటింగ్‌లకు అత్యంత అనుకూల ప్రాంతంగా విశాఖ–భీమిలి ప్రాంతం గుర్తింపు పొందింది. కోకిలమ్మ, అంతులేనికథ, గుప్పెడు మనసులు, నాలుగు స్తంభాలాట, నిప్పురవ్వ, సింహాద్రి, ఆంధ్రావాలా, ఆరాధన, అభిలాష, రావోయి చందమామ వంటి సినిమాలు భీమిలిలోనే చిత్రీకరించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలుపుతోంది.

ఉద్యమ కెరటం.. విశాఖ

(మొదటి పేజీ తరువాయి..) దేనికదే విడివిడిగా సాగినా దేశ, రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా అవి ముందుకు సాగాయి. దేశంలో స్వాతంత్ర్యం సాధ్యమయ్యాక సాధించుకున్న, జాతీయం కాబడిన పలు ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్రంగా విశాఖపట్నం వెలుగొందుతూ వస్తోంది.

త్యాగాల విశాఖ

స్వాతంత్ర్యోద్యమం అంటేనే త్యాగాలమయం. పైగా దీర్ఘకాల పోరాటం.. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో విశాఖ జిల్లా ప్రత్యేక పాత్రనే పోషించింది. జిల్లా నుంచి ఎంతో మంది యువకులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. 1928లో ఖద్దరు ప్రచారం, 1930లో ఉప్పు సత్యాగ్రహం, 1932లో శాసనోల్లంఘన, 1942లో క్విట్ ఇండియా కార్యక్రమాలు విశాఖలోనూ సాగాయి. జాతీయ నాయకత్వం ఇచ్చిన ప్రతి పిలుపులోనూ ఈ జిల్లా వాసులు పాల్గొనడం విశేషం. ఎవిఎన్, ఆంధ్రా మెడికల్ కళాశాలల్లో అనేకమంది చదువులకు స్వస్తి చెప్పి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బ్రిటిష్ పోలీసుల చేతుల్లో వందలాది మంది లాఠీదెబ్బలు తిన్నారు. అరెస్టయ్యారు. జైలు శిక్షలు అనుభవించారు. విశాఖపట్నం, అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి వంటి ప్రాంతాల నుంచి పెద్దఎత్తున అలుపెరగని పోరాటాలు నడిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కూడా ఈ ప్రాంతం నుంచి అనేక మంది చేరారు. తెల్లవాడి దాస్య శృంఖలాల నుంచి విముక్తి కోసం సాగిన పోరాటంలో అల్లూరి సీతారామరాజు విశాఖ మన్యంలో సాగించిన పోరాటం మకుటాయమానంగా నిలుస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లాకు చెందిన కమ్యూనిస్టు నాయకులు కీలకపాత్ర పోషించారు. తెల్లవాడి పాలనపై 18వ శతాబ్దంలోనే విశాఖ జిల్లాలోని అనేకచోట్ల తిరుగుబాట్లు జరిగాయి. 1780 అక్టోబర్ 3న విశాఖ రెజిమెంటులో సిపాయిలు బ్రిటిష్ అధికారులపై తిరుగుబాటు చేశారు. 1794 జులై 9న పద్మనాభ యుద్ధం బ్రిటిష్‌వారి వైఖరిలో పెద్ద మార్పు తీసుకొచ్చింది. విశాఖపట్నాన్ని సైనిక కేంద్రంగానూ, పాలనా కేంద్రంగానూ బలోపేతం చేయాలని బ్రిటిష్‌వారు ఈ యుద్ధం తరువాత నిర్ణయం తీసుకున్నారు.

ఆనాటి స్ఫూర్తి ఈనాటికీ..

పూర్వపు పోరాట బీజాలు విశాఖను వెన్నంటే ఉన్నాయనడానికి నేడు జిల్లాలో సాగుతోన్న అనేక ప్రజా, కమ్యూనిస్టు పోరాటాలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్య వీరులు నింపిన ఉద్యమ స్ఫూర్తి నేటికీ ప్రతిబింబిస్తోందనడానికి ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకునే పోరాటాలే తార్కాణం. అల్లూరి సీతారామారాజు అమాయక గిరిజనులను కదిలించి సాగించిన పోరాటం నేటికీ ఆ గిరిజనుల్లో స్ఫూర్తి నింపుతూ ఉంది. బాక్సైట్, ఇతర ఖనిజ నిక్షేపాలు తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు ఉమ్మడి విశాఖలో గళమెత్తుతూనే ఉన్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితోనే నేడు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం సాగుతోంది. కేంద్రంలోని కాషాయ బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కబంధ హస్తాల్లోకి తీసుకెళ్లాలనే ప్రయత్నాలను, బిజెపి మతోన్మాద, ప్రైవేటీకరణ విధానాలను విశాఖలో సిపిఎం, సిఐటియు నాయకత్వంలో కమ్యూనిస్టు ఉద్యమం, కార్మికోద్యమాలు తిప్పికొడుతూ వస్తున్నాయి.